
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



తిరుపతి
జిల్లా వార్తలు
బుధవారం 28 ఫిబ్రవరి 2024

ఎవరికోసం మార్చారు?

టీడీపీకి పట్టున్న గ్రామాల్లో ఓటు బ్యాంకును చీల్చడమే లక్ష్యంగా చంద్రగిరి నియోజకవర్గంలో గడిచిన ఐదేళ్లలో పోలింగ్ కేంద్రాలను పెంచడమే కాకుండా వైసీపీకి పట్టున్న గ్రామాల్లో ఏర్పాటు చేశారు. దశాబ్దాల కాలంగా వసతులున్న పోలింగ్ కేంద్రాలను తొలగించి వసతులు లేని స్థానాలకు మార్చడంపై టీడీపీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. 2019 ఎన్నికల్లో నియోజకవర్గంలో 325 పోలింగ్ కేంద్రాలుండేవి.తరువాత అధికార పార్టీ తమకు అనుకూలంగా 70 పోలింగ్ కేంద్రాలను పెంచింది. వీటిలో సుమారు వంద కేంద్రాల్లో మౌలిక వసతులు లేవు. రక్షణ లేని ప్రాంతాలకు పోలింగ్ కేంద్రాలను తరలించి రిగ్గింగ్ చేసుకోవడానికి అనుకూలంగా కొన్ని పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు విపక్షాలు ఆరోపిస్తున్నాయి.

- తిరుచానూరు

చంద్రగిరి నియోజకవర్గంలో చర్చనీయాంశమవుతున్న పోలింగ్ బూత్‌ల మార్పు

వసతులు లేకున్నా వైసీపీకి పట్టున్న గ్రామాలకు తరలించారంటూ ఈసీకి టీడీపీ ఫిర్యాదు



వసతులు లేని పెద్దరామాపురం ,బ్రాహ్మణకాల్వ పోలింగ్ కేంద్రాలు - మంగళంలో నిర్మిస్తున్న కొత్త భవనం

- పాకాల మండలం చిగరపల్లె ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఉండేది.గత ఎన్నికల్లో కూడా నాలుగు గ్రామాల ప్రజలు ఇక్కడే ఓటు హక్కును వినియోగించుకున్నారు.టీడీపీకి పట్టున్న ఈ పోలింగ్ కేంద్రాన్ని పెద్దరామాపురానికి తరలించారు. అంతకు ముందే ఇక్కడున్న పోలింగ్‌బూత్‌ను వసతులు లేకపోవడంతో ఇక్కడ తీసేశారు. అందరికీ అనుకూలంగా వున్న చిగరపల్లెలో యల్లంపల్లి, ఎనమలవారిపల్లి, ఇప్పకాలువ, గాజులవారి ఇళ్ల ప్రాంతాలకు చెందిన సుమారు 1,700మందికి పైగా ఓటు హక్కును వినియోగించు కునేవారు.ఇపుడు వీరంతా మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కూడా లేని పెద్దరామాపురానికి వెళ్లి ఓటు వేయాల్సివుంది.

- రామచంద్రాపురం మండలం రావిళ్లవారిపల్లెలోని పోలింగ్ బూత్‌లో ఇన్నాళ్లూ ఓటు హక్కు వినియోగించు కునేవారు.దాన్ని రద్దు చేసి బ్రాహ్మణకాల్వ గ్రామానికి పోలింగ్ కేంద్రాన్ని తరలించారు.దాన్ని కూడా కనీస వసతు లు లేని దళితవాడలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటుచేయడం గమనార్హం.ఇదే మండలం మహంతువారిపల్లెలోని పోలింగ్ కేంద్రాన్ని ఎలాంటి వసతులూ లేని ఒకే గది వున్న రైతు భరోసా కేంద్రానికి తరలించారు.

- తిరుపతి రూరల్ మండలం మంగళంలో ఏకంగా శిథిలావస్థలో ఉన్న భవనంలో పోలింగ్ కేంద్రంగా ప్రకటించారు.దీనిపై టీడీపీ ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించగా ఆగమేఘాలపై భవనాన్ని తొలగించి నూతన భవన నిర్మాణ పనులు చేపట్టారు. అది ఎన్నికల నాటికి పూర్తయ్యే పరిస్థితి కనిపించడంలేదు.పెరుమాళపల్లి, అవిలాల, హరిపురంకాలనీ తదితర ప్రాంతాల్లోనూ వసతులు లేని పోలింగ్ కేంద్రాలు కనిపిస్తున్నాయి. నియోజకవర్గంలోని దాదాపు 30శాతం పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపు, మరుగుదొడ్లు లేవని తీవ్ర విమర్శలు వస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదు.ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి పోలింగ్ కేంద్రాల మార్పు విషయంలో పునఃపరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.

రాజకీయ ఎత్తుగడతోనే మార్పు



రాజకీయ ఎత్తుగడతోనే అన్ని వసతులూ వున్న మా గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని మార్చారు. ఏ సౌకర్యంలేని పెద్దరామాపురానికి పోలింగు కేంద్రాన్ని ఎలా తరలిస్తారు? అధికారుల నిర్ణయం విడ్డూరంగా వుంది.

- యువరాజు, చిగరపల్లి

4 గ్రామాల ప్రజలకు సౌకర్యంగా వుండేది



చిగరపల్లిలో పోలింగ్ కేంద్రం ఎంతో అనుకూలంగా ఉండేది.పక్కనే వున్న ఎనమలవారిపల్లి, యల్లంపల్లి, ఇప్పకాల్వ,గాజులవారిఇళ్ల గ్రామాల ప్రజలు సౌకర్యవంతంగా ఓటు హక్కును వినియోగించుకునేవారు. అలాంటిది మా ఊరిలోని పోలింగ్‌కేంద్రాన్ని వసతులు లేని పెద్ద రామాపురానికి తరలించడం ఎవరి ప్రయోజనం కోసం?

- విజయకుమార్, చిగరపల్లి

స్వేచ్ఛగా ఓటేయకుండా కుట్ర



రావిళ్లవారిపల్లెలో అన్ని వసతులూ ఉన్న పోలింగ్ కేంద్రంలో హాయిగా ఓటు హక్కును వినియోగించు కునేవాళ్లం.కుట్రతో ఎలాంటి సౌకర్యం లేని బ్రాహ్మణకాల్వ అంగన్‌వాడీ కేంద్రానికి పోలింగ్ కేంద్రాన్ని తరలించారు. ఒకే గది ఉన్న ఈ కేంద్రానికి ర్యాంపులేదు. ప్రహరీ లేదు.కనీస వసతులు లేని ఈ ప్రాంతానికి పోలింగ్ కేంద్రం తరలించడం వెనుక ఏ మర్మం వుందో అధికారులే చెప్పాలి.

- రామ్మోహన నాయుడు, బ్రాహ్మణకాల్వ

ఏం అవసరం వచ్చింది ?



రావిళ్లవారిపల్లె నుంచి పోలింగు కేంద్రాన్ని తరలించారు సరే బ్రాహ్మణకాల్వలోనే అన్ని వసతులూ వున్న స్కూల్లో ఏర్పాటు చేయొచ్చు కదా.వసతులు లేని అంగన్‌వాడీ కేంద్రంలో ఎలా ఏర్పాటు చేస్తారు? ఓటుహక్కును ప్రశాంతంగా వినియోగించుకోకుండా చేసేందుకే ఈ మార్పు.

- భాస్కర నాయుడు, బ్రాహ్మణకాల్వ.





సభలో టీడీపీ నేతల సమైక్యనాదం

బీసీల మెడపై వైసీపీ కత్తి

- జయహో బీసీ సభలో టీడీపీ నేతల ధ్వజం

తిరుపతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): బీసీలకు టీడీపీ పెద్దపీట వేస్తే, వైసీపీ తమ మెడపై కత్తిపీట వేసిందని బీసీ సంఘ నాయకులు మండిపడ్డారు. తిరుపతి ఇందిరా మైదానంలో మంగళవారం సాయంత్రం టీడీపీ ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమం ఘనంగా జరిగింది.జిల్లా నలుమూలల నుంచి టీడీపీ బీసీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున డప్పు కొడుతూ, చిందులు వేస్తూ, బాణా సంచా పేలుళ్ల మధ్య ర్యాలీగా 'జయహో బీసీ' అంటూ సభావేదిక వద్దకు చేరుకున్నారు. తొలుత ఎన్టీఆర్‌కు, పూలేకి నివాళులర్పించారు.సభకు అధ్యక్షత వహించిన పార్టీ పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ యాదవ్ మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచీ బీసీలకు వెన్నుదన్నుగా నిలిచి, ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా సముచిత స్థానం కల్పించిందన్నారు.అయితే వైసీపీ ఈ ఐదేళ్లలో నిరంకుశ పాలనతో బీసీలను అణగదొక్కిందంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. బీసీలందరూ ఏకోన్ముఖంగా నిలిచి చంద్రబాబును సీఎం చేసుకోవడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మాట్లాడుతూ బీసీలకు రక్షణ చట్టం తీసుకురాబోతున్న చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ముఖ్యంగా బీసీలపై ఉందన్నారు.బీసీ సెల్ అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం మాట్లాడుతూ విధులు, నిధులు ఉండే పదవులు వైసీపీ ముఖ్య సామాజికవర్గానికి కట్టబెట్టిన జగన్ రెడ్డి నిధుల్లేని, చివరకు కుర్చీలు కూడా లేని పదవులను బీసీలకిచ్చారని దుయ్యబట్టారు.2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇద్దరు బీసీలను టీటీడీ ఛైర్మన్లుగా నియమిస్తే జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇద్దరు రెడ్లను నియమించారని గుర్తు చేశారు. అంటే బీసీలు టీటీడీ ఛైర్మన్ పదవికి పనికిరారని ఆయన భావించారంటూ ధ్వజమెత్తారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు గురవారెడ్డి , మస్తాన్ యాదవ్ మాట్లాడుతూ బీసీల కోసం కార్పొరేషన్, ఫెడరేషన్లను పెట్టిన ఘనత చంద్రబాబుదైతే, బీసీలకు సబ్సిడీ రుణాలను రద్దుచేసిన ఘనత జగన్‌కు దక్కుతుందన్నారు.బీసీ నాయకులు దంపూరి భాస్కర యాదవ్, కృష్ణ యాదవ్, మహేష్ యాదవ్, పుష్పావతి, దశరథాచారి, మునస్వామి, బొమ్మి సురేంద్ర యాదవ్, లీలావతమ్మ, పెరుమాళ్ మధు, సుబ్బుయాదవ్, మధుసూదన యాదవ్, రామయ్య, సుబ్రమణ్యం రెడ్డి, సాధికార సమితి నాయకులు ఇమిడిశెట్టి వెంకటేశ్వర్లు, రాజయ్య, శంకర్, అశోక్, శ్రీరాములు, భక్తవత్సలం, ఆముదాల తులసీదాస్, మనోహరాచారి, జగన్నాథం, విశ్వనాథం, పెరుమాళ్, మునిరాజ, భాస్కర్ గౌడ్, సుబ్రమణ్యం రెడ్డి తదితరులు పాల్గొనగా తిరుపతి నియోజకవర్గ ఇంచార్జి చిట్టిబాబు, పార్టీ సీనియర్ నాయకులు ఆర్సీ మునికృష్ణ, ఊకా విజయకుమార్, పులుగోరు మురళీకృష్ణా రెడ్డి, జేబీ శ్రీనివాస్, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, సూరా సుధాకర రెడ్డి, బుల్లెట్ రమణ, బ్యాంకు శాంతమ్మ తదితరులు సభకు హాజరయ్యారు.



నవకంఠ రావణుడు!

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27: శ్రీకాళహస్తీశ్వరాలయానికి కానుకగా భక్తులు సమర్పించిన రావణాసుర వాహనమిది.శివరాత్రి ఉత్సవాల ఊరేగింపులో వాడుకునేందుకు ఇద్దరు భక్తులు దారువుతో తయారుచేసిన ఈ వాహనాన్ని సోమవారం ముక్కంటి ఆలయానికి అందజేశారు. అయితే పది తలలుండాల్సిన రావణాసురుడికి 9మాత్రమే వుండడాన్ని అధికార యంత్రాంగం కానీ , ధర్మకర్తల మండలి కానీ గుర్తించకనే ఆలయంలో పెట్టేశారు. ప్రచార ఆర్భాటం, కమీషన్ల కక్కుర్తిపై దృష్టి పెట్టడం తప్ప ఇలాంటి వాటి గురించి ఎందుకు ఆలోచిస్తారంటూ భక్తజనం నుంచీ పెద్దఎత్తున విమర్శలు వస్తున్నాయి.



షార్‌లో నిర్మించిన పిఫ్ భవనం

షార్‌లో పిఫ్ భవనం ప్రారంభం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 27 : తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని అంతరిక్ష ప్రయోగ కేంద్రం షార్‌లో నిర్మించిన పీఎస్ఎల్వీ ఇంటిగ్రేషన్ ఫెసిలిటి (పిఫ్) భవనాన్ని మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. పీఎస్ఎల్వీ రాకెట్లతో పాటు చిన్న తరహా రాకెట్ల తయారీ, అనుసంధానం కోసం ఈ భవనాన్ని నిర్మించారు. పీఎస్ఎల్వీ ప్రయోగాలకే కాకుండా ఎస్ఎస్ఎల్వీ వంటి చిన్న ప్రయోగాల వేగవంతానికి కూడా ఇదెంతో దోహదపడుతోంది. ఇది అందుబాటులోకి రావడంతో ఇకపై ఏడాదికి 15 ప్రయోగాలు చేపట్టాలని ఇస్రో లక్ష్యం పెట్టుకుంది.ప్రధాని మోదీ తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో సుమారు రూ.1800 కోట్లతో నిర్మించిన మూడు ప్రాజెక్టులను ప్రారంభించారు. వీటిలో షార్‌లోని పిఫ్, మహేంద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో సెమీ క్రయోజనిక్స్ ఇంటిగ్రేటెడ్ ఇంజిన్ అండ్ స్టేజ్ టెస్ట్ ఫెసిలిటి, వీఎస్ఎస్‌సీలో ట్రైసోనిక్ విండ్ టన్నెల్ ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు.

స్కాలర్‌షిప్ ఇవ్వకుంటే అరెస్టు వారెంట్లు జారీ చేస్తాం

- మహిళా వర్సిటీ, రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు జాతీయ ఎస్సీ కమిషన్ హెచ్చరిక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 27: ఎస్సీ విద్యార్థినులకు స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్, సర్టిఫికెట్లు ఇవ్వకుంటే అరెస్టు వారెంట్లు జారీ చేస్తామని పద్మావతి మహిళా వర్సిటీ, రాష్ట్ర ప్రభుత్వ అధికారులను జాతీయ ఎస్సీ కమిషన్ ఛైర్మన్ అరుణ్ హల్దార్ హెచ్చరించారు.2018 నుంచి యూనివర్సిటీలో నిర్వహించిన బీఏ, ఎంఏ పబ్లిక్ పాలసీ అండ్ ఆంత్రోపాలజీ కోర్సులో చేరిన విద్యార్థులకు స్కాలర్‌షిప్స్‌ఫీజు రీయింబర్స్‌మెంట్స్ పెండింగ్‌లో ఉంచారు. దాంతో చండీప్రియ (చంద్రలేఖ)నేతృత్వంలోని 31మంది ఎస్సీ విద్యార్థినులు జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషన్.. వర్సిటీ రిజిస్ట్రార్, ఇతర అధికారులకు సమన్లు జారీ చేసింది. కమిషన్ ఎదుట విచారణకు తప్పనిసరిగా హాజరు కావాలని, ఈ వ్యవహారంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఈ క్రమంలో ఇటీవల కమిషన్ చేపట్టిన విచారణకు రిజిస్ట్రార్ హాజరై వివరణ ఇచ్చారు. దాంతో 21 రోజుల్లోపు విద్యార్థినులకు స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరింది. లేకుంటే అరెస్టు వారెంట్లు జారీ చేస్తామని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో యుద్ధ ప్రాతిపదికన విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించేందుకు వర్సిటీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ, హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ, సోషియల్ వెల్ఫేర్ అధికారులకు లేఖ రాశారు.

ఏడాదిన్నరగా నడుస్తున్న వ్యవహారం

ఏడాదిన్నరగా ఈ వ్యవహారం నడుస్తోంది. గతంలో విద్యార్థినులు వర్సిటీలోనే ప్రత్యక్ష ఆందోళన కూడా చేపట్టారు. రూ.కోటీ 50 లక్షల మేర విద్యార్థినులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ పెండింగ్‌లో ఉన్నాయి.

అతివేగానికి ముగ్గురు యువకుల బలి



మృతులు హరీష్, రామ్‌చరణ్

రేణిగుంట,ఫిబ్రవరి 27: అతివేగంతో బైకులను నడిపి ముగ్గురు యువకులు దుర్మరణం పాలయ్యారు.గాజులమండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి కథనం మేరకు.... చెన్నై-రేణిగుంట జాతీయరహదారిలో రేణిగుంట మండలం మొలగమూడి బస్టాప్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. నారాయణవనానికి చెందిన హరీష్(22),ఏర్పేడు మండలం అంజిమేడుకు చెందిన రామ్‌చరణ్(17) పుత్తూరు వైపు నుంచి పల్సర్ బైక్‌పై వస్తుండగా మొలగమూడి బస్టాప్ సమీపంలో రివర్స్ చేస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొన్నారు.ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు.మృతదేహాలను పోస్టుమార్టం కోసం తిరుపతి లోని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

డ్యూటీనుంచి ఇంటికొస్తూ...



సురేంద్ర

నాయుడుపేట, ఫిబ్రవరి 27: నాయుడుపేట - తిమ్మాజికండ్రిగ మార్గంలోని స్వర్ణముఖినది సమీపంలో మోటారు సైకిల్‌ను ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందారు. వాకాడు మండలం అందలమాల గ్రామానికి చెందిన సురేంద్ర మేనకూరు సెజ్‌లో పని చేస్తూ నాయుడుపేటలోని పిచ్చిరెడ్డితోపులో నివాసం ఉంటున్నాడు. మంగళవారం విధులు ముగించుకుని మోటారు సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యంలో స్వర్ణముఖినది బ్రిడ్జి సమీపానికి రాగానే ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సురేంద్ర మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీజీ పరీక్షల వాయిదా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 27: ఎస్వీయూలో పీజీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడ్డాయి. మార్చి ఒకటి నుంచి ఏడో తేదీదాకా పరీక్షలు నిర్వహించాలని తొలుత నిర్ణయించారు. అయితే, ఇదే తేదీల్లో టెట్‌ను ప్రభుత్వం నిర్వహించనుంది. దాంతో పీజీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు మార్చి ఏడో తేదీకి వాయిదా పడ్డాయి. 14వ తేదీ దాకా ఈ పరీక్షలు కొనసాగుతాయని సీఈ దామ్లానాయక్ పేర్కొన్నారు.

స్విమ్స్ శ్రీపద్మావతి జనరల్ ఆస్పత్రిలో నగదు రహిత వైద్య సేవలు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 27: స్విమ్స్ శ్రీపద్మావతి జనరల్ ఆస్పత్రిలో నగదు రహిత వైద్య సేవలను మార్చి ఒకటో తేదీనుంచి అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గైనకాలజీ, ఒబెస్ట్రిక్ (స్త్రీల వ్యాధులు, ప్రసూతి విభాగం), పీడియాట్రిక్స్, ఆప్తమాలజీ, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ విభాగాల పరిధిలో ఆరోగ్యశ్రీ కింద నగదు రహిత వైద్య సేవలు అందిస్తామన్నారు. సాధారణ, సిజేరియన్ కాన్పులు, టాన్సిల్స్, కాటరాక్ట్, హెర్నియా, అపెండిక్స్, మొలలు, థైరాయిడ్‌తోపాటు సాధారణ జబ్బులైన జ్వరాలు, వాంతులు, విరేచనాలు మొదలైన వాటికి కూడా నగదు రహిత వైద్య సేవలు అందిస్తామని పేర్కొన్నారు.

500 బస్తాల రేషన్ బియ్యం సీజ్



నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 27: అక్రమంగా తరలిస్తున్న 500 బస్తాల రేషన్ బియ్యాన్ని డీఎస్వో రఘువీర్ స్వాధీనం చేసుకున్నారు. నాయుడుపేట జాతీయ రహదారిపై మంగళవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న లారీని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. లారీని సీజ్ చేసి ఏఎంసీ గోదాముకు తరలించారు. పట్టుబడిన రేషన్ బియ్యం విలువ సుమారు రూ.10లక్షలుంటుందని రఘువీర్ తెలిపారు.




రేపట్నుంచే కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

నేడు ఉత్సవాలకు అంకురార్పణ



చంద్రగిరి, ఫిబ్రవరి 27: శ్రీనివాసమంగాపురం కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 29 నుంచి మార్చి 8వ తేదీ వరకు నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా ఆలయంలో చలువ పందిళ్లు, రంగవల్లులు, ప్రత్యేకంగా ప్రసాద కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబుచేశారు. ఆలయం వెనుక భాగంలో యాగశాల ఏర్పాటు చేశారు. తిరుమాడ వీధుల్లో భక్తులు స్వామివారి వాహన సేవలను తిలకించడానికి గ్యాలరీలు, భక్తులను ఆకర్షించే విధంగా పుష్ప ప్రదర్శనశాల, వాహనాల పార్కింగ్, సెల్ ఫోన్ కౌంటర్, మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాట్లు చేస్తున్నారు.జేఈవో వీరబ్రహ్మం, ఆలయ ప్రత్యేకాధికారి, చీఫ్ పీఆర్వో రవి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు మునిచెంగల్రాయులు, వెంకటస్వామి పర్యవేక్షణలో ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల కారణంగా ఆలయంలో అన్ని రకాల ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. నేటి సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల నడుమ పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం నిర్వహించి శాస్త్రోక్తంగా అంకురార్పణ చేయనున్నారు. గురువారం ఉదయం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా ఉదయం 8 నుంచి 9 గంటల వరకు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు తిరుచ్చి ఉత్సవం నిర్వహించనున్నారు. 8.40 నుంచి 9 గంటల మధ్య మీనలగ్నం నందు ధ్వజారోహణ ఘట్టాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నారు.





అలరిస్తున్న విద్యుత్ అలంకరణలు

తిరుచానూరు ఉక్కిరిబిక్కిరి



తిరుచానూరును కమ్మేసిన డంపింగ్‌యార్డు పొగ



● గ్రామాన్ని కమ్మేస్తున్న డంపింగ్‌యార్డు పొగ ● రూ.కోట్ల ఆదాయమున్న పంచాయతీ పరిస్థితి ఇదీ

తిరుచానూరు, ఫిబ్రవరి 27: శ్రీవారి దేవేరి కొలువైన తిరుచానూరుకు రాయలసీమ జిల్లాల్లో అత్యధిక ఆదాయం వచ్చే పంచాయతీగా గుర్తింపువుంది.ఏడాదికి సుమారు రూ.7కోట్ల ఆదాయమున్న ఈ మేజర్ పంచాయతీకి డంపింగ్ యార్డు కరువై జనం కాలుష్యంతో ఇబ్బందిపడుతున్నారు.సుమారు 6వేల గడపలున్న గ్రామంలో రోజూ సేకరించిన టన్నుల కొద్దీ చెత్తను అమ్మవారి ఆలయానికి కూతవేటు దూరంలో ఉన్న స్వర్ణముఖి నది ఒడ్డున వేసే ఆ చెత్తకు నిప్పు పెడుతున్నారు. దీంతో వ్యర్థాల నుంచి వచ్చే పొగతో జనం అస్వస్థతకు లోనవుతున్నారు.రోజూ దర్శనానికి వచ్చే వేలమంది భక్తులు తమ వాహనాలను పార్కు చేసుకునేందుకు టీటీడీ కేటాయించిన ప్రదేశంలోనే టన్నుల కొద్దీ చెత్తను డంపింగ్ చేస్తున్నారు.డంపింగ్‌యార్డు పొగతో అమ్మవారి భక్తులతో పాటు, శంకర్‌నాయుడుకాలనీ, వైష్ణవి నగర్, అమ్మవారి ఆలయ పరిసర ప్రాంతాల ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.చిన్నపిల్లలు, వృద్ధులు అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలవుతున్నారు.జడ్పీ హైస్కూల్ ప్రాంతంలో ఇళ్ల కిటికీలు ఎప్పుడూ మూసే వుంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. డంపింగ్ యార్డులేకపోవడంతో పంచాయతీలోని పలు కాలనీల్లో సేకరించిన చెత్తను నివాసాల సమీపంలోనే పారిశుధ్య సిబ్బంది పారవేసి చేతులు దులుపుకుంటున్నారు. పంచాయతీ పాలకవర్గంతో పాటు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి స్పందించి డంపింగ్‌యార్డుకు రెండు ఎకరాల స్థలం కేటాయించి తమను కాలుష్యబారి నుంచి కాపాడాలని బాధితులు కోరుతున్నారు.

డంపింగ్‌యార్డును తరలించండి



మా ఇంటి సమీపంలోనే పంచాయతీలో సేకరించిన చెత్తకు నిప్పు పెడుతున్నారు. పగలూరాత్రీ తేడా లేకుండా పొగ కాలనీని కమ్మేస్తోంది. 24గంటలూ కిటికీలు, తలుపులు వేసుకుని బతకాల్సి వస్తోంది.

- ఏకవల్లి, శంకర్‌నాయుడు కాలనీ

ఇళ్లల్లో ఉండలేకపోతున్నాం



ఇళ్ల సమీపంలో ఎవరైనా డంపింగ్‌యార్డు పెడతారా? తలుపు తీస్తే పొగ చుట్టుముడుతోంది. కళ్లు మంట పెడుతున్నాయి. ఊపిరి ఆడడం లేదు.కలెక్టర్ ఇప్పటికైనా స్పందించి నివాసాల సమీపంలో డంపింగ్ యార్డును తొలగించాలి.

- అముద, శంకర్‌నాయుడుకాలనీ

రోడ్డ కనబడక ప్రమాదాల బారిన పడుతున్నారు



బస్టాండులో పొగ మధ్య జీవనం సాగించాల్సి వస్తోంది. వందల కుటుంబాలుండే, వేలాది భక్తులు వచ్చే ఈ ప్రాంతంలో చెత్త వేసి నిప్పు పెట్టడం ఎంతవరకు సబబు? పొగతో రోడ్డు కనబడక వాహనదారులు గాయాలపాలవుతున్నారు.

- జలగం శివకుమార్, తిరుచానూరు

కలెక్టర్‌కు, ఎస్పీకి ఫిర్యాదు చేసినా
ఆగని ఇసుక అక్రమ రవాణా

ఏర్పేడు, ఫిబ్రవరి 27: మండలంలో నిరంతరాయంగా కొనసాగుతున్న ఇసుక అక్రమరవాణాను మంగళవారం గోవిందపురం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఏర్పేడు మండలంలో చెన్నంపల్లి వద్ద స్వర్ణముఖి నది ప్రారంభమై ముసలిపేడు వద్ద శ్రీకాళహస్తి మండలంలోకి ప్రవేశిస్తుంది. నది పరీవాహక ప్రాంతంలో వైసీపీ నేతలు ఇసుకను ఎక్సకవేటర్లతో తోడి ట్రాక్టర్ల ద్వారా తరలించేస్తున్నారు.తిరుపతి, రేణిగుంట తదితర ప్రాంతాల్లో అమ్మి సొమ్ముచేసుకుంటున్నారు.ప్రధానంగా మునగలపాళెం, గోవిందవరం గ్రామాల వద్ద స్వర్ణముఖి నది ప్రాంతంలో కొద్ది రోజులుగా ఎక్సకవేటర్లతో వైసీపీ నేతలు ఇసుకను ట్రాక్టర్ల ద్వారా గట్టుపైకి చేర్చి, అక్కడి నుంచి రాత్రి వేళల్లో రోజుకు కనీసం 30 నుంచి 50 టిప్పర్ల ఇసుక చెన్నైకి తరలించేస్తున్నారు.టిప్పర్ ఇసుకను సుమారు రూ.60వేల నుంచి రూ.70వేలవరకు విక్రయిస్తున్నట్టు తెలిసింది. ఈ విషయంపై వారం రోజులుగా రెవెన్యూ అధికారులకు, పోలీసులకు గోవిందవరం గ్రామస్తులు సమాచారమిచ్చారు. అయినా వారి నుంచి స్పందన రాకపోవడంతో సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు, ఎస్పీకి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్పీ ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులకు ఫోన్‌చేసి ఇసుక రవాణా అరికట్టాలని ఆదేశించారు.అయినప్పటికీ పోలీసులు రాకపోవడంతో గోవిందవరం గ్రామస్తులు మంగళవారం ఇసుక అక్రమ రవాణాపై దండయాత్ర చేశారు. టీడీపీ సీనియర్ నాయకుడు పేరం చిరంజీవులనాయుడు ఆధ్వర్యంలో గోవిందవరం గ్రామస్తులు ట్రాక్టర్లలో తరలిస్తున్న ఇసుకను అడ్డుకుని, మూడు ట్రాక్టర్లతో పాటు, ఎక్సకవేటర్లను స్వాధీనం చేసుకుని ఏర్పేడు పోలీసులకు అప్పగించారు.



ఎక్సకవేటర్‌ను అడ్డుకుంటున్న గోవిందవరం గ్రామస్థులు



గోవిందరవ స్వర్ణముఖి నదిప్రాంతంలో భూగర్భ జలాలు బయటపడే విధంగా అక్రమార్కులు ఇసుకను తోడేసిన దృశ్యం

ప్రతి ఇంటి బాధ్యత మోస్తా

● ఇంటింటి ప్రచారంలో పులివర్తి నాని



ప్రజలతో మాట్లాడుతున్న పులివర్తి నాని

తిరుచానూరు, ఫిబ్రవరి 27: ఒక అవకాశం ఇస్తే ప్రతి ఇంటి బాధ్యత మోస్తానని చంద్రగిరి టీడీపీ ఇన్‌ఛార్జి పులివర్తి నాని అన్నారు. మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాలను తిరుచానూరు పంచాయతీ చైతన్యపురంలో మంగళవారం నిర్వహించారు.గ్రామానికి వచ్చిన నానీకి జనసేన, టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు.టీడీపీ నాయకులు సుబ్బయ్య, జయకుమార్, రంజిత్‌కుమార్, బాలకృష్ణగోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బోదగుట్టకు నిప్పు



రామచంద్రాపురం, ఫిబ్రవరి 27: మండలంలోని కుప్పంబాదూరు బోదగుట్ట అడవికి గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం సాయంత్రం నిప్పు పెట్టారు. ఈ అడవి రాయలచెరువు కట్ట నుంచి అప్పలాయగుంట వరకు విస్తరించి ఉంది. నెన్నూరు నుంచి పీవీ పురం వరకు మంటలు వ్యాపించడంతో దాదాపు వెయ్యి హెక్టార్ల అడవి దగ్ధమైంది. అటవీప్రాంతం కింద ఉన్న మామిడితోటల యజమానులు అడవిలో మంటలు రగులుతుండంతో ఆందోళన చెందుతున్నారు. వారం క్రితం కూడా అటవీశాఖ అధికారులు అడవికి నిప్పు పెట్టకుండా ఉండేందుకు గ్రామాల్లో ప్రజలను చైతన్యపరిచారు.

జేఏసీ నేతలపై కేసులు ఎత్తేయాలి



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

చంద్రగిరి, ఫిబ్రవరి 27: ఏపీ జేఏసీ నేతలపై పెట్టిన కేసులు ఎత్తివేయాలంటూ మంగళవారం చంద్రగిరి తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చంద్రగిరి తాలూక ఏపీ జేఏసీ అధ్యక్షుడు ఈశ్వరయ్య మాట్లాడుతూ బుధవారం ప్రభుత్వ ఉద్యోగల సమస్యల పరిష్కారానికి ఏపీ జేఏసీ అమరావతి చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చిందన్నారు. అయితే పోలీసులు ప్రభుత్వ ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేయాలనే ఉద్దేశంతో నాయకులపై కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యదర్శి స్వర్ణలత, కోశాధికారి వెంకటలక్ష్మి, యూటీఎఫ్ మండలాధ్యక్షుడు రాజేంద్రబాబు, ఉద్యోగులు పాల్గొన్నారు.



వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

భాకరాపేట, ఫిబ్రవరి 27: వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని టీడీపీ నాయకురాలు పులివర్తి సుధారెడ్డి అన్నారు. 'మీ ఇంటికి మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా చిన్నగొట్టిగల్లు మండలం కోటబైలు పంచాయతీలో మంగళవారం ఆమె పర్యటించారు. సూపర్ సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలను ఇంటింటా పంచారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. టీడీపీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళి, ప్రధాన కార్యదర్శి మదనమోహన, తెలుగు మహిళ అధ్యక్షురాలు చిట్టెమ్మ, నాయకులు మోహన్ రెడ్డి, ఆర్వీ రమణారెడ్డి, మునస్వామి నాయుడు, కుమారస్వామి రెడ్డి, మస్తాన్ సాహెబ్, రఫీ, చంద్రబాబు, ముత్యాలు, చంద్రశేఖర్, రాజగోపాల్ నాయుడు, మౌలాలి, యశ్వంత్ రాయల్, తులసీ రాయల్, రవీందర్‌రెడ్డి, రమేశ్, మల్లికార్జున రెడ్డి, ఎర్రయ్య నాయుడు, మురళి పాల్గొన్నారు.




తిరుపతి ఇందిరా మైదానంలో మంగళవారం సాయంత్రం జరిగిన జయహో బీసీ సభకు మేళతాళాలతో ర్యాలీగా వస్తున్న టీడీపీ బీసీ నాయకులు - అలరించిన నృత్య ప్రదర్శన

కక్షకట్టి.. నకిలీ హాల్ టికెట్ సృష్టించి..!

● గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షల్లో పట్టించాలని పన్నాగం ● తీరా హాల్ టికెట్ నకిలీదిగా తెలిసి ఫిర్యాదు
● అసలు నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు ● కర్నూలులో కుట్ర.. చిత్తూరులో వెలుగుచూసిన వైనం

చిత్తూరు, ఫిబ్రవరి 27: వారిద్దరూ బంధువులే. కానీ, రెండు కుటుంబాల మధ్య మనస్పర్థలున్నాయి. దీనిని మనసులో పెట్టుకున్నాడు. గ్రూపు-2 ప్రిలిమినరీ స్క్రీనింగ్ పరీక్షల్లో నకిలీ హాల్ టికెట్‌ను సృష్టించి ఇచ్చి.. పోలీసులకు పట్టించాలని పథకం పన్నాడు. తీరా అతడే నిందితుడిగా దొరికిపోయాడు. కర్నూలు జిల్లాలో మొదలైన ఈ కుట్ర.. చిత్తూరులో బయటపడింది. ఈ వివరాలను మంగళవారం చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, ఒకటో పట్టణ సీఐ విశ్వనాథరెడ్డితో కలిసి ఏఎస్పీ అరీఫుల్లా మీడియాకు వివరించారు. ఆయన తెలిపిన ప్రకారం.. కర్నూలు జిల్లా క్రిష్ణగిరి మండలం కంబాలపాడుకు చెందిన సుదర్శనం ఏపీపీఎస్సీ గ్రూపు-2 ప్రిలిమినరీ స్క్రీనింగ్ పరీక్ష రాయాలని భావించారు. దీనికోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని తన బంధువైన, కర్నూలు జిల్లా డోన్ నగరం రాజా కాంప్లెక్స్‌లోని మీ సేవా కేంద్రంలో పనిచేస్తున్న ఇమ్మానుయేలును అడిగారు. గతంలో తమ రెండు కుటుంబాల మధ్య ఉన్న వైషమ్యాలను మనసులో పెట్టుకుని ఇమ్మానుయేలు దరఖాస్తు చేయకుండా మోసం చేయాలని నిర్ణయించుకున్నాడు. దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసింది. హాల్ టికెట్‌ను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు ప్రకటించారు. తనకు హాల్‌టికెట్ తీసివ్వాలని సుదర్శనం అడిగారు. అదే మీ సేవా కేంద్రంలో మండ్ల శ్రీనివాసులు అనే అభ్యర్థి ఒరిజనల్ హాల్ టికెట్ పీడీఎఫ్ ఉంది. దీనిని పీడీఎఫ్ కన్వర్షన్ అప్లికేషన్ ద్వారా ఎంఎస్ వర్డ్ అప్లికేషన్‌లోకి ఇమ్మానుయేలు మార్చాడు. సుదర్శనం వ్యక్తిగత వివరాలు, ఫొటోను మండ్ల శ్రీనివాసులు హాల్ టికెట్‌లో ఎడిట్ చేసి నకిలీ హాల్ టికెట్‌ను తయారు చేసిచ్చాడు. పరీక్షా కేంద్రాన్ని దూరంగా పెడితే వెళ్లడానికి సమయం చాలక... పరీక్ష రాయకుండా వచ్చేస్తాడని అనుకున్నాడు. అందుకని చిత్తూరు నగరం మర్రిమాను వీధిలోని నారాయణ కాలేజీని పరీక్షా కేంద్రంగా నకిలీ హాల్‌టికెట్‌లో చూపించాడు. ఒకవేళ సకాలంలో పరీక్షకు వెళితే నకిలీ హాల్ టికెట్ కావడంతో పోలీసులకు పట్టుబడతాడని, అప్పుడు తన పంతం నెరవేరుతుందని భావించాడు. ఇదేమి తెలియని సుదర్శనం ఆ హాల్ టికెట్‌తో ఈనెల 25వ తేదీన జరిగిన గ్రూప్ 2 ప్రిలిమినరీ పరీక్షకోసం చిత్తూరుకు చేరుకున్నారు. ఆ హాల్ టికెట్‌లో చూపిన నారాయణ కాలేజీని ప్రభుత్వం పరీక్షా కేంద్రంగా ఎంపిక చేయలేదని తెలిసింది. దీంతో చిత్తూరులోని అధికారులను ఆయన కలిసి హాల్ టికెట్ చూపగా.. నకిలీదని గుర్తించారు. సుదర్శనం ఫిర్యాదు మేరకు చిత్తూరు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. డోన్‌లో ఉన్న ఇమ్మానుయేలును అదుపులోకి తీసుకుని విచారించారు. అతడి వద్ద ఉన్న కంప్యూటర్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నేరం రుజువుకావడంతో మంగళవారం ఇమ్మానుయేలును అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఈ కేసులో అసలైన నిందితుడిని పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ, ఎస్‌ఐ, పోలీసు సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు.



మీడియా సమావేశంలో నిందితుడిని చూపిస్తున్న ఏఎస్పీ అరీఫుల్లా

శివరాత్రి ఏర్పాట్లు షురూ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27: ముక్కంటి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.మార్చి 3వ తేదీ శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమై 13రోజుల పాటు జరగనున్నాయి.ఆలయంలోని గోపురాలకు, ఊరేగింపులో ఉత్సవమూర్తులు అధిరోహించే వాహనాలకు సుందరంగా రంగులు దిద్దారు. ఇక ఆలయం లోపల విద్యుత్ అలంకరణలు పూర్తి చేశారు. పట్టణ ప్రధాన కూడళ్లలో విద్యుత్ అలంకరణల హోర్డింగ్, దేవతా మూర్తుల కటౌట్ల పనులు తుది దశలో సాగుతున్నాయి. ఇక సన్నిధి వీధిలో ధూర్జటి కళా ప్రాంగణం, భక్తులు బస చేసే షెడ్లు, కైలాసం సెట్టింగ్ పనులు జోరుగా సాగుతున్నాయి.



విద్యుత్ అలంకరణలో ఊంజల సేవా మండపం



అలంకార మండపం వద్ద విద్యుత్ అలంకరణలు



కైలాసం సెట్టింగ్ కోసం ఏర్పాటు చేస్తున్న షెడ్డు



ధూర్జటి కళా ప్రాంగణం ఏర్పాట్లు



సిద్ధమైన ఉత్సవ మూర్తుల వాహనాలు

ఉపాధ్యాయనగర్‌లో స్థల వివాదం

పరస్పర ఫిర్యాదుతో ఇరువర్గాలపై కేసుల నమోదు


ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 27: ఉపాధ్యాయనగర్‌లోని ఓ ఇంటి స్థలం విషయమై ఇరు వర్గాలమధ్య వివాదం రేగింది. పరస్పరం ఫిర్యాదు చేయడంతో ఇరువర్గాలపైనా కేసులు నమోదయ్యాయి. అలిపిరి ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జీవనకోన పిండి మిషన్ వీధికి చెందిన సుధాకర్.. ఉపాధ్యాయనగర్ సర్వే నెంబరు 11/2బీ2లోని తన స్థలంలో ఇంటి నిర్మాణ పనులు చేపట్టారు. మంగళవారం ఉదయం చంద్రగిరి మండలం ఎ.రంగంపేటకు చెందిన బి.ఆనందయ్య భార్య బొమ్మల సుజాత (62), ఆమె కుమారుడు బాలమురళి ఉపాధ్యాయనగర్‌కొచ్చి సదరు స్థలం తమదంటూ పనులను అడ్డుకున్నారు. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో చేతిగాజులు పగిలి సుజాతకు చిన్నపాటి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న అలిపిరి బ్లూకోల్ట్స్ ఘటనా ప్రదేశానికి చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పారు. తర్వాత సుజాత రుయాస్పత్రికి వెళ్లి ప్రథమ చికిత్స చేయించుకుంది. వైద్యులు అలిపిరి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులొచ్చి సుజాత వాంగ్మూలాన్ని నమోదుచేసి సుధాకర్, మరో వ్యక్తి అర్జునయ్యపై దాడి కేసు నమోదుచేశారు. ఇదిలా ఉండగా.. తమ స్థలంలో నిర్మాణ పనులు చేస్తుండగా సుజాత, ఆమె కుమారుడు బాలమురళి తమ స్థలంలోకి దౌర్జన్యంగా ప్రవేశించి పనులను అడ్డుకున్నారని, ప్రశ్నించిన తమపై దాడిచేయడమే కాకుండా నిర్మాణ సామగ్రిని ధ్వంసం చేశారంటూ అలిపిరి పోలీసులకు సుధాకర్ ఫిర్యాదు చేశారు. దాంతో సుజాత, బాలమురళిపై కేసు నమోదైంది. ఈ క్రమంలో స్థలం ఎవరిదో రెవెన్యూశాఖ ద్వారా తేల్చుకోవాలని ఇరువర్గాలకూ సూచించామని ఎస్‌ఐ తెలిపారు. కాగా.. 2010నుంచి ఈ వివాదం జరుగుతున్నట్లు సమాచారం.

బాధితురాలికి జనసేన, టీడీపీ పరామర్శ



తిరుపతి(కొర్లగుంట): రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్న సుజాతను మంగళవారం జనసేన, టీడీపీ నేతలు కిరణ్‌రాయల్, ఊకా విజయ్‌కుమార్ పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వీరివెంట నాయకులు సి.శంకర్‌యాదవ్, బాజ్జీ, హేమకుమార్, రాజమోహన్, మునస్వామి, రాజేష్ ఆచారి, రమేష్‌నాయుడు, వినోద్, సెల్వకుమార్, సురేష్ తదితరులున్నారు.

ప్రభుత్వ భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలి

● వామపక్షాల డిమాండ్


మీడియాతో మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 27: శ్రీకాళహస్తి, తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల పరిధిలోని ప్రభుత్వ భూములపై శ్వేతపత్రాన్ని కలెక్టర్ విడుదల చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో వామపక్ష నాయకులు కందారపు మురళి, నాగరాజు, పెంచలయ్య మీడియాతో మాట్లాడారు. 2019కి ముందు ఈ మూడు నియోజవర్గాల్లో ఉన్న ప్రభుత్వ భూములెంత.. ఇప్పుడు ఎంత ఉన్నాయన్న దానిపై ప్రత్యేక కమిషన్ వేసి కలెక్టర్ విచారణ చేపట్టాలన్నారు. తిరుపతిలో నివాసం ఉంటున్న స్థానికులకు శ్రీకాళహస్తిలో ఇంటి పట్టాలిచ్చి ఇప్పటివరకు స్థలాలు చూపించలేదన్నారు. దాంతో పేదలంతా కలిసి కరకంబాడి వద్ద ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంటే, వారికి తాము మద్దతు ఇవ్వడం నేరమా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇక 600 మంది పోలీసులను పంపి మహిళలపై చేసిన దాడికి జవాబు చెప్పాలన్నారు. మరోపక్క ప్రభుత్వ భూములను వైసీపీ నేతలు ఆక్రమించుకుని కోట్లాది రూపాయలకు విక్రయిస్తుంటే రెవెన్యూ శాఖ ఏంచేస్తోందని నిలదీశారు. సాక్షాత్తూ వైసీపీ నగర మేయర్ భూమిని కబ్జాచేస్తే వారికే న్యాయం దొరకని పరిస్థితి తిరుపతిలో నెలకొందన్నారు. కేసీపేట వద్ద వందలాది ఎకరాలు కబ్జా చేసి.. వైసీపీ నేతలు ప్లాట్లు వేసి విక్రయించడం కలెక్టర్‌కు కనపడలేదా? అన్నారు. రేణిగుంట తహసీల్దారు కార్యాలయం పక్కన 15 ఎకరాలు, అనాసంపల్లిలో ప్రభుత్వ భూములను ప్లాట్లు వేసి విక్రయిస్తుంటే అక్కడి తహసీల్దారు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములు, ప్రైవేటు ఆస్తుల కబ్జాలపై శుక్రవారం అఖిలపక్షంతో సమావేశం నిర్వహించి.. భూకబ్జాదారుల భరతం పడతామన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.73 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.73 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్టు టీటీడీ మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 70,077 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 24,427 మంది తలనీలాలు సమర్పించారు.

రాయలసీమకు చేసిన తప్పును దిద్దుకోండి

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్


మీడియాతో మాట్లాడుతున్న చింతామోహన్

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 27: దశాబ్దాలుగా రాయలసీమకు చేసిన తప్పును దిద్దుకోవాలని రాష్ట్రంలోని పార్టీలకు కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. నీలం సంజీవరెడ్డి నుంచి నేటి సీఎం జగన్ వరకు చేసిన తప్పును దిద్దుకునే అవకాశం ఉందని చెప్పారు. తిరుపతిని రాజధానిగా ప్రకటిస్తే అన్ని వసతులు ఇక్కడ ఏర్పాటు కావడంతోపాటు రాయలసీమలోని జిల్లాలు అభివృద్ధి చెందుతాయన్నారు. టీటీడీని పొగడాలంటే కార్మికులకు పదివేల అరియర్స్‌ను ఇచ్చి చూపించాలని చాలెంజ్ చేశారు. కేవలం ఎన్నికల స్టంట్‌లో భాగంగానే ఓట్ల కోసం తాయిలాలు అని విమర్శించారు. యార్లపల్లి గోపి, తేజోవతి, శాంతి యాదవ్, మునిశోభ, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

స్థానికంగా ఇళ్ల స్థలాలు కేటాయించాలి: సీపీఎం


ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

తిరుపతి (రవాణా), ఫిబ్రవరి 27: తిరుపతి అర్బన్ మండలం ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీ మంగళం పరిధిలోని ప్రజలకు జగనన్న ఇళ్లపట్టాల కింద స్థానికంగానే స్థలాలను కేటాయించాలని సీపీఎం నేతలు వేణుగోపాల్, బుజ్జి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందించారు. మోదీన్, మీరాంబి, జానకి, కుమారి, అమ్ములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై ప్రభుత్వం కక్షసాధింపు మానుకోవాలి


నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగ సంఘాల నేతలు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 27: ఉద్యోగులపై కక్ష సాధింపులను ప్రభుత్వం మానుకోవాలని ఏపీఎన్జీవోస్ నగర శాఖ అధ్యక్షుడు సురేష్ బాబు డిమాండ్ చేశారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలపై శాంతియుతంగా నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమాలను అడ్డుకోవడం, ఉద్యోగ సంఘాల నేతలకు నోటీసులు జారీ చేయడం సరికాదన్నారు. ఈ మేరకు మంగళవారం ఏపీఎన్జీవోస్ భవనం ముందు ఉద్యోగులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నడూ లేని విధంగా ఉద్యోగులను ఈ ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వైఖరిని మార్చుకుని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. నగరశాఖ కార్యదర్శి బాలాజీ, నేతలు శ్రీనివాసులు, రఘు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు


శశికళ - హీరో ఆశిష్ దంపతులు - తిరుమల గ్యారేజ్‌లోని సిబ్బందితో మిద్దెల హరి

తిరుమల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో.. తమిళనాడు మాజీ సీఎం జయలలిత స్నేహితురాలు శశికళ, సినీహీరో ఆశిష్, అద్విత దంపతులున్నారు. అలాగే ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి, తిరుమల డిపో మేనేజర్ విశ్వనాథ్ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం తిరుమలలోని ఆర్టీసీ డిపో గ్యారేజ్‌ని పరిశీలించారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. మిద్దెల హరిని వక్ఫ్ బోర్డు చైర్మన్ సిరాజ్ బాషా సత్కరించారు.

కెమెరాల కొనుగోలుకు కొటేషన్ల ఆహ్వానం

తిరుమల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ముఖ్య ప్రజాసంబంధాల అధికారి కార్యాలయంలోని ఫొటోగ్రఫీ సెక్షన్‌కు అవసరమైన canon EOS R8 camera along with RF 24MM105-MM f/4L IS USM camera LENS రెండు కెమెరాల కొనుగోలుకు కొటేషన్లు ఆహ్వానిస్తూ టీటీడీ మంగళవారం ఓ ప్రకటన జారీ చేసింది. అధీకృత డీలర్లు వారి కొటేషన్లు pro@tirumala.org కి పది రోజుల్లోపు పంపాలని టీటీడీ కోరింది. ఇతర వివరాలకు 74033 13333 నెంబరును సంప్రదించాలని సూచించింది.

కేంద్ర సాయుధ బలగాల విడిదిగా ఎస్వీయూ హెచ్ బ్లాక్

పరిశీలించిన ఎస్పీ మలికా గర్గ్


అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 27: సార్వత్రిక ఎన్నికల విధులకు రానున్న కేంద్ర సాయుధ బలగాలు ఎస్వీయూ హెచ్ బ్లాక్‌లో విడిది చేయనున్నాయి. దీన్ని ఎస్పీ మలికా గర్గ్ ఎంపిక చేశారు. మంగళవారం హెచ్ బ్లాక్‌లో వసతి సౌకర్యాలను ఆమె పరిశీలించారు. సాయుధ బలగాలు వచ్చేలోపు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు సూచనలిచ్చారు. ఏఆర్ డీఎస్పీ రవీంద్రారెడ్డి, ఎస్వీయూ పోలీస్ స్టేషన్ సీఐ మురళీమోహన్‌రావు ఎస్పీతోపాటు ఉన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని వాచ్‌మ్యాన్ మృతి


వెంకటాద్రి మృతదేహం

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 27: ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఓ వాచ్‌మ్యాన్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పులిచెర్ల మండలం దిన్నుపాటివారిపల్లెకు చెందిన వెంకటాద్రి తిరుపతి మహిళా వర్సిటీ సమీపంలోని పశుపతి అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మ్యాన్‌గా పనిచేస్తూ.. అక్కడే భార్యాబిడ్డలతో నివాసం ఉంటున్నాడు. సోమవారం రాత్రి పొద్దుపోయాక ఉప్పరపల్లె రోడ్డుపై నడిచి వెళ్తుండగా గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఆయన్ను వెనుకనుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటాద్రికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆయన్ను 108 వాహనంలో రుయాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మంగళవారం వేకువజామున మృతి చెందాడు. దీనిపై తిరుపతి రూరల్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

12వ గుండె మార్పిడి శస్త్ర చికిత్స సక్సెస్

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 27: శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో 12వ గుండె మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతమైందని ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం రాత్రి ప్రారంభమైన ఈ శస్త్రచికిత్స మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటల వరకు జరిగిందన్నారు. శ్రీకాకుళం జిల్లా రాజోలుకు చెందిన ధర్మారావు(28) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్‌కు గురికావడంతో ఆయన గుండెను శ్రీకాకుళం నుంచి వైజాగ్ అక్కడ నుంచి తిరుపతి శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయంకు సోమవారం రాత్రి 10.25 నిమిషాలకు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ గుండెను డైలేటెడ్ కార్డియోమయోపతి వ్యాధితో బాధపడుతూ శ్రీపద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 42 ఏళ్ల వ్యక్తికి విజయవంతంగా అమర్చినట్లు డైరెక్టర్ వివరించారు. శస్త్ర చికిత్స చేయించుకున్న వ్యక్తి పూర్తి ఆరోగ్యంగా కోలుకుంటున్నాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైద్యులను, సిబ్బందిని టీటీడీ ఈవో ధర్మారెడ్డి అభినందించారు.

పబ్లిక్ పరీక్షల నిర్వహణలో మినహాయింపు ఇవ్వండి

డీఈవో శేఖర్‌కి ఎస్టీయూ నాయకుల వినతి


డీఈవోను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 27: వచ్చేనెలలో జరిగే టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షల నిర్వహణలో దీర్ఘకాలిక వ్యాధులు, చంటి పిల్లలున్న మహిళలు, గర్భిణులుగా ఉన్న టీచర్లకు విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ నాయకులు కోరారు. ఈమేరకు జిల్లా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం డీఈవో వి.శేఖర్‌ని కలసి వినతిపత్రం అందించారు. అలాగే ఇటీవల నూతనంగా ఎన్నికైన ఎస్టీయూ జిల్లాసంఘ ప్రతినిధులను డీఈవోకి పరిచయం చేశారు. అలాగే జాయింట్ కలెక్టర్‌ని కూడా మర్యాదపూర్వకంగా కలసి ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరామని, దీనిపై స్పందించిన జేసీ మాట్లాడుతూ కలెక్టరేట్‌లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని వివరించారన్నారు. రాష్ట్ర నాయకులు నాగేశ్వరరావు, ధనంజయులనాయుడు, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రమేష్‌బాబు, జగన్నాథం, నాయకులు భీమినేని మునికృష్ణనాయుడు, మోహన్, రేణుకాదేవి, శారదమ్మ, దేవేంద్ర, హరికృష్ణ, మురళి, వేణుగోపాల్, దేవేంద్రయాదవ్, సుబ్రహ్మణ్యం, కేశవ, సురేష్, రామాంజనేయులు, మురళీకృష్ణ, మధు, వాసు, శ్రీనివాసులు, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

7 నెలలుగా జీతాలు రాలేదు

● డీ అడిక్షన్ సెంటర్ సిబ్బంది ఆవేదన
● వైద్య ఆరోగ్యశాఖ గ్రీవెన్స్‌డేకి 20 అర్జీలు


డీఎంహెచ్‌వోకి వినతిపత్రం అందజేస్తున్న వైద్యులు, సిబ్బంది

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 27: తమకు ఏడు నెలలుగా జీతాలు రాలేదని రుయాస్పత్రి పరిధిలోని మత్తు పదార్థ వ్యసన నిర్మూలన కేంద్రం (డీ అడిక్షన్ సెంటర్)లో పనిచేసే వైద్యులు, సిబ్బంది.. డీఎంహెచ్‌వో శ్రీహరి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. తన కార్యాలయంలో డీఎంహెచ్‌వో మంగళవారం గ్రీవెన్స్ డే నిర్వహించగా, 20 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా డీ అడిక్షన్ సిబ్బంది మాట్లాడుతూ.. మూడు, నాలుగు నెలలకోసారి జీతాలు వచ్చేవని, ఈసారి ఏడు నెలలు దాటుతున్నా అందలేదంటూ వినతిపత్రం సమర్పించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అలాగే అనేక రకాల సమస్యలపై ఉద్యోగులు అర్జీలను అందజేశారు. వీటిని విభాగాల వారీగా పరిశీలించి తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని డీఎంహెచ్‌వో తెలిపారు. డీపీఎంవో శ్రీనివాసులు, ఏవో వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌ఐ కుటుంబానికి ఆర్థిక సాయం


బాధితులకు చెక్ అందజేస్తున్న ఎస్పీ మలికా గర్గ్

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 27: అకాలమరణం చెందిన ఓ ఏఎస్‌ఐ కుటుంబానికి ఎస్పీ మలికా గర్గ్ ఆర్థిక సాయం అందజేశారు. ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పనిచేసిన ఎం.రమేష్ నాయక్ గత ఏడాది సెప్టెంబరులో అనారోగ్యంతో విధి నిర్వహణలో ఉండగానే మరణించారు. ఆయన కుటుంబానికి జిల్లా పోలీసు సంక్షేమ నిధినుంచి రూ.50వేల చెక్‌ను మంగళవారం తన చాంబర్‌లో బాధిత కుటుంబీకులకు ఎస్పీ అందజేశారు. కారుణ్య నియామకం కింద కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

యువమోర్చా కార్యవర్గ సభ్యుడిగా ఈశ్వర్



చంద్రగిరి, ఫిబ్రవరి 27: బీజేపీ యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా తిరుపతి రూరల్ మండలానికి చెందిన దేవాంగుల ఈశ్వర్‌ను నియమిస్తున్నట్లు ఆ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు మిట్టా వంశీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

దోర్నకంబాలలో గడప గడపకూ..

చంద్రగిరి, ఫిబ్రవరి 27: చంద్రగిరి మండలం, దోర్నకంబాల పంచాయతీలో మంగళవారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి,చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

చంద్రగిరి, ఫిబ్రవరి 27: తిరుపతి బాలాజీకాలనీలోని ఎస్వీసీసీ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మినీ జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. జస్ట్‌డయల్, అపోలో ఫార్మసీ, డిక్సన్, బిగ్ సీ మొబైల్స్, ముత్తూట్ గ్రూప్, ఇస్కాన్ సంస్థల ఇంటర్వ్యూలకు 117మంది హాజరయ్యారు. 65 మంది ఉద్యోగాలు పొందారు.జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం, ప్రిన్సిపాల్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపక పదోన్నతులకు పచ్చజెండా

ఎస్వీయూ పాలకమండలిలో పలు అంశాలపై సుదీర్ఘ చర్చ


సమావేశంలో పాల్గొన్న వీసీ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 27: ఎస్వీయూనివర్సిటీలోని అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పిస్తూ పాలకమండలి పచ్చజెండా ఊపింది. యూనివర్సిటీలోని 53 మంది అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పించేందుకు ఇటీవల కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం (సీఏఎస్) ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ క్రమంలో దీనిపై చర్చించి అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగానూ, అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లగానూ పదోన్నతులు కల్పిస్తూ మంగళవారం నిర్వహించిన పాలకమండలి సమావేశంలో ఆమోదిస్తూ తీర్మానం చేశారు. వీసీ శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం వీసీ చాంబర్‌లో పాలకమండలి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ, ఆర్థిక శాఖ అధికారులు ఆన్‌లైన్ ద్వారా ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ సమావేశం సాగిం ది. వర్సిటీకి సంబంధించిన పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. పాలకమండలి సభ్యులు జ్యోతి, నారాయణబాబు, సంధ్యారాణి, మొహిద్దీన్ బాష, మంజుల, సుగుణమ్మ, సుమకిరణ్, సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

తీర్మానాలివే..

● 53 మంది అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు ● నాన్ టీచింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ జారీ చేసిన జీవో-10 అమలు ● పలు భవన నిర్మాణ పనులు, వాటికి సంబంధించిన నిధుల అంచనాకు ఆమోదం ● నూతన కోర్సుల ఏర్పాటుకు అనుమతి ● వివిధ విభాగాల్లో దాతల సహకారంతో గోల్డ్ మెడల్స్‌కు ఆమోదం ● ఆర్థికపరమైన అంశాలపై చర్చించి, నిర్ణయం తీసుకునేందుకు ఐదుగురితో ఆర్థిక సలహా మండలి ఏర్పాటు.

తిరుపతిలో 1న కాంగ్రెస్ బహిరంగ సభ

ప్రత్యేక హోదా అజెండాగా నిర్వహిస్తున్నామన్న గిడుగు


విలేకర్ల సమావేశంలో గిడుగు రుద్రరాజు

చిత్తూరు రూరల్/పలమనేరు, ఫిబ్రవరి 27: ప్రత్యేక హోదా అజెండాతో తిరుపతిలో శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడు గిడుగు రుద్రరాజు తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. మంగళవారం ఆయన చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో, పలమనేరులోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తిరుపతి సభలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని బీజేపీ హామీ ఇచ్చి తొమ్మిదేళ్లు గడిచినా నెరవేర్చలేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో గాడి తప్పిన పాలనను బాగుచేయాలంటే తిరిగి కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలన్నీ బీజేపీకి కొమ్ముకాస్తున్నాయని విమర్శించారు. ఆ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. తాము ప్రజల మేలు చేసే పథకాలు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. తిరుపతి సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎంపీ సచిన్‌పైలట్, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, ఇతర నేతలు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సభకు నేతలు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. చిత్తూరు సమావేశంలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతం, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకుడు శంకర్, ఏఐసీసీ మెంబర్ పార్థసారథిరెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు విక్టోరియా, రాణి, నేతలు చిట్టిబాబు, శంకర్ టిక్కి, రాయల్, వెంకటేష్, నరసింహులు, పరదేశి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. పలమనేరు పార్టీ కార్యాలయంలో నాయకులు శ్రీరామమూర్తి, పార్థసారథిరెడ్డి, రవీంద్రరెడ్డి, ప్రభాకర్, ధనంజయ గౌడ, భాస్కర్, దొరస్వామి, మణి తదితరులు గిడుగు రుద్రరాజును కలిశారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

యువతను దగా చేసిన వైసీపీ: తెలుగు యువత



మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎస్ బ్రోచర్లను విడుదల చేస్తున్న నెలవల, రవినాయుడు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 27: యువతను అన్ని విధాలుగా వైసీపీ దగా చేసిందని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ బ్రోచర్లను విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవినాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పాదయాత్రలో యువతకు ఇచ్చిన హామీలను విస్మరించారని అన్నారు. ఆడుదాం... ఆంధ్రా... పేరిట ఆర్భాటం చేసిన వైసీపీ రాష్ట్ర క్రికెట్ బోర్డును తన కబంద హస్తాల్లోకి లాక్కుందని విమర్శించారు. రాష్ట్రంలో యువత, నిరుద్యోగులు వేసే ఓట్లే రాష్ట్ర భవిష్యత్తుకు నాంది పలుకుతాయని అన్నారు. నెలవల మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కృష్ణయాదవ్, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హేమంత్‌రాయల్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవనాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు అవధానం సుధీర్, నాయకులు రవి, కార్తీక్‌రాజు, రాజా తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం



భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో సంధ్యారాణి, టీడీపీ నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 27: చంద్రబాబునాయుడుతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. మంగళవారం స్థానిక మసీదువీధిలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకపాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్, ఆర్టీసీ చార్జీలను పెంచివేయడంతో పేదలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు, యువతకు, ఇతర వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు పరిచేలా చంద్రబాబునాయుడు మినీమేనిఫెస్టోనను విడుదల చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలుపించుకోవాలన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, నాజరుద్దీన్, జహంగీర్, రవీంద్రరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, నరసింహులు నాయుడు, అమరయ్య, గాయం రమణయ్య, గురవయ్య, భారతి, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో భద్రతా వారోత్సవాలు



జాతీయ భద్రతా వారోత్సవాలను ప్రారంభిస్తున్న శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ శేఖర్

శ్రీసిటీ, ఫిబ్రవరి 27: శ్రీసిటీలో 53వ జాతీయ భద్రతా వారోత్సవాలను మంగళవారం శ్రీసిటీ వైస్‌ప్రెసిడెంట్(ప్రాజెక్టు) ఎన్.శేఖర్ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన శ్రీసిటీ సిబ్బంది, స్థానికులకు ఈ కార్యక్రమం ప్రాధాన్యతను వివరించి వారితో ప్రతిజ్ఞ చేయించారు. భ్రదతా వారోత్సవాల్లో భాగంగా వారం రోజుల పాటు వివిధ అవగాహన కార్యక్రమాలతో పాటు శ్రీసిటీ ఉద్యోగులు, ఈ ప్రాంతంలోని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహించనున్నట్లు శ్రీసిటీ మేనేజర్(సేఫ్టీ) నరేంద్రబాబు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు నివారించడానికి భద్రతా అంశాలపై ప్రజల్లో అవగాహన పెంచడమే భద్రతా వారోత్సవాల లక్ష్యమని శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పాలీసెట్‌కు దరఖాస్తు చేసుకోండి

సత్యవేడు, ఫిబ్రవరి 27: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ నిర్వహించనున్న పాలీసెట్-2024కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఉషాదేవి పేర్కొన్నారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడు తూ పదో తరగతి ఉత్తీర్ణులైన వారు పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 20 నుంచి ఏప్రిల్ 4వ తేదీతో వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 27న పాలీసెట్ జరుగుతుందని, పాలీసెట్‌కు సిద్ధమయ్యే విద్యార్థులకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ముగిసిన వెంటనే ఏప్రిల్ 1 నుంచి స్థానిక పాలిటెక్నికల్ కళాశాలలో ఉచిత శిక్షణ ఇస్తామన్నా రు. దీంతో పాటు శిక్షణకు హాజరయ్యే విద్యార్థులకు అందరికి మెటీరియల్స్ కూడా అందిస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం హెచ్‌టీపీఎస్//బీటీఈటీ.ఏపీ.జీవోవీ.ఐఎన్ వెబ్ సైట్‌ని సందర్శించాలన్నారు. దీనికి సంబంధించి 94929 78378 మొబైల్ నెంబరును సంప్రదించాలన్నారు.

పరీక్షా కేంద్రం తనిఖీ

తడ, ఫిబ్రవరి 27: స్థానిక బాలిక, బాలుర ఉన్నత పాఠశాలల్లో ప్రీ పబ్లిక్ పరీక్షా కేంద్రాలను ఎంఈవో మల్లికార్జున్‌రావు పరిశీలించారు. అలాగే గ్రద్దగుంట ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట సీఆర్పీలు ఉన్నారు.

పోలేరమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 27: పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మ హుండీలో భక్తులు సమర్పించి కానుకలను జిల్లా దేవదాయశాఖ అధికారి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం లెక్కించారు. రెండు నెలల పదిహేను రోజులకు హుండీ ద్వారా రూ.3,31,592 ఆదాయం వచ్చినట్లు రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ నగదును బ్యాంకులో జమ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గంధవల్లి సిద్దయ్య, కమిటీ సభ్యులు దేవత చెంచుకిషోర్‌బాబు, పసల హరి, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌బాబు, ఈవో శశాంక్, సీనియర్ సహాయకుడు దినేష్, సిబ్బంది యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.



పోలేరమ్మ హుండీ నగదును లెక్కిస్తున్న సిబ్బంది





అలంకార మండపం వద్ద విద్యుత్ అలంకరణలు - కైలాసం సెట్టింగ్ కోసం ఏర్పాటు చేస్తున్న షెడ్డు

శివరాత్రి ఏర్పాట్లు షురూ



సిద్ధమైన ఉత్సవ మూర్తుల వాహనాలు



దూర్జటి కళా ప్రాంగణం ఏర్పాట్లు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27: ముక్కంటి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.మార్చి 3వ తేదీ శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమై 13రోజుల పాటు జరగనున్నాయి.ఆలయంలోని గోపురాలకు, ఊరేగింపులో ఉత్సవమూర్తులు అధిరోహించే వాహనాలకు సుందరంగా రంగులు దిద్దారు. ఇక ఆలయం లోపల విద్యుత్ అలంకరణలు పూర్తి చేశారు. పట్టణ ప్రధాన కూడళ్లలో విద్యుత్ అలంకరణల హోర్డింగ్, దేవతా మూర్తుల కటౌట్ల పనులు తుది దశలో సాగుతున్నాయి. ఇక సన్నిధి వీధిలో ధూర్జటి కళా ప్రాంగణం, భక్తులు బస చేసే షెడ్లు, కైలాసం సెట్టింగ్ పనులు జోరుగా సాగుతున్నాయి.

అధ్యాపక పదోన్నతులకు పచ్చజెండా
ఎస్వీయూ పాలకమండలిలో పలు అంశాలపై సుదీర్ఘ చర్చ



సమావేశంలో పాల్గొన్న వీసీ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 27: ఎస్వీయూనివర్సిటీలోని అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పిస్తూ పాలకమండలి పచ్చజెండా ఊపింది. యూనివర్సిటీలోని 53 మంది అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పించేందుకు ఇటీవల కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం (సీఏఎస్) ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ క్రమంలో దీనిపై చర్చించి అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగానూ, అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగానూ పదోన్నతులు కల్పిస్తూ మంగళవారం నిర్వహించిన పాలకమండలి సమావేశంలో ఆమోదిస్తూ తీర్మానం చేశారు. వీసీ శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం వీసీ చాంబర్‌లో పాలకమండలి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ, ఆర్థిక శాఖ అధికారులు ఆన్‌లైన్ ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సమావేశం సాగింది. వర్సిటీకి సంబంధించిన పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. పాలకమండలి సభ్యులు జ్యోతి, నారాయణబాబు, సంధ్యారాణి, మొహిద్దీన్ బాషా, మంజుల, సుగుణమ్మ, సుమకిరణ్, సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

తీర్మానాలివే: 53 మంది అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు ● నాన్ టీచింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ జారీ చేసిన జీవో-10 అమలు ● పలు భవన నిర్మాణ పనులు, వాటికి సంబంధించిన నిధుల అంచనాకు ఆమోదం ● నూతన కోర్సుల ఏర్పాటుకు అనుమతి ● వివిధ విభాగాల్లో దాతల సహకారంతో గోల్డ్ మెడల్స్‌కు ఆమోదం ● ఆర్థికపరమైన అంశాలపై చర్చించి, నిర్ణయం తీసుకునేందుకు ఐదుగురితో ఆర్థిక సలహా మండలి ఏర్పాటు.

12వ గుండె మార్పిడి శస్త్ర చికిత్స సక్సెస్

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 27: శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో 12వ గుండె మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతమైందని ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం రాత్రి ప్రారంభమైన ఈ శస్త్రచికిత్స మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటల వరకు జరిగిందన్నారు. శ్రీకాకుళం జిల్లా రాజోలుకు చెందిన ధర్మారావు(28) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్‌కు గురికావడంతో ఆయన గుండెను శ్రీకాకుళం నుంచి వైజాగ్ అక్కడ నుంచి తిరుపతి శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయంకు సోమవారం రాత్రి 10.25 నిమిషాలకు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ గుండెను డైలేటెట్ కార్డియోమయోపతి వ్యాధితో బాధపడుతూ శ్రీపద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 42 ఏళ్ల వ్యక్తికి విజయవంతంగా అమర్చినట్లు డైరెక్టర్ వివరించారు. శస్త్ర చికిత్స చేయించుకున్న వ్యక్తి పూర్తి ఆరోగ్యంగా కోలుకుంటున్నాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైద్యులను, సిబ్బందిని టీటీడీ ఈవో ధర్మారెడ్డి అభినందించారు.

డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు కృషి: కురుగొండ్ల

వెంకటగిరి, ఫిబ్రవరి 27: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వెంకటగిరిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. మంగళవారం పట్టణ పరిధిలోని 4వ వార్డు సాలికాలనీలో బాబు ష్యూరిటీ - భవిషత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. ఈ సందర్భంగా స్థానికుడు నాగరాజు మాట్లాడుతూ తాను, తన భార్య కిడ్నీ సమస్యలతో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నామని తెలిపారు. తనకు ప్రభుత్వం రూ.10వేలు ఇస్తోందని, తన భార్యకు ఇవ్వడం కుదరదని చెబుతున్నారని కురుగొండ్ల దృష్టికి తీసుకెళ్లారు. రూ.10వేలతో ఇద్దరికీ వైద్యం చేయించుకొనేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే వెంకటగిరిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని కురుగొండ్ల హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, పునుగోటి విశ్వనాధనాయుడు, కేవీకే ప్రసాద్ నాయుడు, శ్రీరామదాసు, గంగాధర్, అవ్వారు సత్యనారాయణ, కాపా శ్రీనివాసులు నాయుడు, రవి, సుధ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్ 16వ తేదీకి వాయిదా

గూడూరు, ఫిబ్రవరి 27: స్థానిక కోర్టు ఆవరణలో మార్చి 9న జరగాల్సిన జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని మహాశివరాత్రి సందర్భంగా 16వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీపర్వీన్ సుల్తానా బేగం మంగళవారం తెలిపారు. ఈ మార్పును కక్షిదారులు గమనించాలని కోరారు.

మున్సిపల్ కమిషనర్ బదిలీ

వెంకటగిరి, ఫిబ్రవరి 27: వెంకటగిరి మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో ప్రకాశం జిల్లా అద్దంకి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న అబ్దుల్ రషీద్ నియమితులయ్యారు. కాగా, వెంకటరమణయ్య కృష్ణా జిల్లా పెడన మున్సిపల్ కమిషనర్‌గా నియమితులయ్యారు.

ఆటోను ఢీకొన్న లారీ
ఒకరికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 27: నాయుడుపేట - తిమ్మాజికండ్రిగ స్వర్ణముఖి నది బ్రిడ్జిపైన ఆటోను లారీ ఢీకొన్న సంఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడగా, మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. బాలాయపల్లి మండలం సంఘవరం నుంచి ప్రయాణికులతో నాయుడుపేట వైపు వెళ్తున్న ఆటోను లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ శీను తీవ్రంగా గాయపడగా, ఐదుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేమిరెడ్డితో చిల్లకూరు మంతనాలు
టీడీపీలో చేరతానని ప్రకటన




వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో చర్చిస్తున్న దశరధరామిరెడ్డి

కోట, ఫిబ్రవరి 27: కోట మండలం దొరువుకట్ట గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నేత చిల్లకూరు దశరధరామిరెడ్డి నెల్లూరులో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని కలిసి చర్చలు జరిపారు. గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, నల్లపరెడ్డి, నేదురుమల్లి కుటుంబాలకు సన్నిహితుడు అయిన దశరధరామిరెడ్డి కోట మండల రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. వేమిరెడ్డిని కలిసిన అనంతరం దశరధరామిరెడ్డి మాట్లాడుతూ మార్చి 2వ తేదీన టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు.

సైన్సు దినోత్సవానికి రాకెట్ నమునా సిద్ధం

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 27: మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో బుధవారం జరుగనున్న సైన్సు దినోత్సవాన్ని పురష్కరించుకుని ఉపాధ్యాయులు రాకెట్ నమూనాను రూపొందించారు.



టీడీపీతోనే రామరాజ్యం: పాశం

కోట, ఫిబ్రవరి 27: రాష్ట్రంలో ఐదేళ్ల రాక్షస పాలనలో ముగిసి రెండు నెలల్లో రామరాజ్యం రానున్నదని గూడూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం కోట పట్టణంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ నుంచి గోపాలరెడ్డి విగ్రహం సెంటర్, శ్యామసుందరపురం సెంటర్లలో పాశం సునీల్‌కుమార్‌కు పట్టణ ప్రజలు మంగళ హారతులతో అడుగడుగున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ దుష్టపాలనను ఓటు అనే ఆయుధంతో తరిమికొట్టాలన్నారు. పల్లెల్లో అభివృద్ధి పరుగులు తీయాలంటే సైకిల్ గుర్తుపై ఓటువేసి చంద్రబాబునాయుడును సీఎం గానూ, తనను ఎమ్మెల్యేగానూ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సర్వోత్తమ రెడ్డి, జలీల్ అహ్మద్, భాస్కర్‌రెడ్డి, తీగల సురేష్‌బాబు, పోలయ్య, అనిల్, గుర్రం అశోక్‌కుమార్, దారా సురేష్, నౌషాద్, షంషుద్దీన్, వెంకటకృష్ణయ్య, వెంకటకృష్ణారెడ్డి, సుహాసిని, పోలమ్మ, తదితరులు ఉన్నారు.

వ్యక్తిగత శుభ్రతపై బాలికలకు అవగాహన



విద్యార్థులకు నాప్‌కిన్స్ పంపిణీ చేస్తున్న నిరీషా సన్నారెడ్డి

శ్రీసిటీ, ఫిబ్రవరి 27: శ్రీసిటీలోని ప్రముఖ నాప్‌కిన్ తయారీ పరిశ్రమ యూనిచార్మ్ శ్రీసిటీ ఫౌండేషన్ సహకారంతో మన సంస్కృతి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో బాలికల వ్యక్తిగత శుభ్రత అనే అంశంపై సూళ్లూరుపేటలోని ఏపీఎస్‌డబ్ల్యూ రెసిడెన్షియల్ స్కూలులో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధి నిరీషా సన్నారెడ్డి, యూనిచార్మ్ సీఎస్‌ఆర్ వింగ్ నిపుణులు అంకిత తదితరులు సూళ్లూరుపేటలోని ఏపీఎస్‌డబ్ల్యూ రెసిడెన్షియల్ స్కూలు, బీసీ బాలికల హాస్టల్, తడలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయకు చెందిన వెయ్యి మంది పైగా విద్యార్థినులకు శానిటరీ నాప్‌కిన్ ప్యాక్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మన సంస్కృతి సేవా ట్రస్టు వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ కె.హరినాథరెడ్డి, తేజోవతి తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



విద్యాసామగ్రి అందజేస్తున్న భరత్‌రెడ్డి

తొట్టంబేడు, ఫిబ్రవరి 27: మండలంలోని చిట్టత్తూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదవతరగతి చదువుతున్న విద్యార్థులకు జాతియవిని యోగదారుల కమిషన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి కలవకుంట భరత్‌రెడ్డి విద్యా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చంద్రశేఖర్, సీపీఎం నాయకుడు రాహూరు సుబ్రమణ్యం, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందెం స్థావరాలపై దాడి: నలుగురి అరెస్టు

తొట్టంబేడు, ఫిబ్రవరి 27: మండలంలోని కంచినపల్లి గ్రామం సమీపంలో కోడిపందెం స్థావరాలపై మంగళవారం దాడులు నిర్వహించి నలుగురుని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు కోళ్లు, 1700 రూపాయలు స్వాదీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తొట్టంబేడు ఎస్సై రాఘవేంద్ర తెలిపారు.

పచ్చాలమ్మ దేవతకు ప్రతేక పూజలు



బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 27: మండలంలోని పల్లమాల గ్రామంలో పచ్చాలమ్మ దేవతకు మంగళవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. పచ్చాలమ్మ దేవత విగ్రహానికి అభిషేకాలు చేసి పూలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆయల నిర్వహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఇంటి పట్టాల పంపిణీ

ఏర్పేడు, ఫిబ్రవరి 27: జగనన్న కాలనీలో లబ్ధిపొందిన లబ్ధిదారులకు మంగళవారం పాపానాయుడుపేట సచివాలయంలో సర్పంచ్ లలిత అధ్యక్ష తన ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్ చేయించి వారికి ఇంటి పట్టాలనుఅందించారు.

టీడీపీ గెలుపునకు కృషి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న గంజి మాధవయ్య

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 27: నగరి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న గాలి భానుప్రకాష్ గెలుపునకు ప్రతి కార్యకర్త, నాయకుడు శక్తివంచన లేకుండా కృషి చేద్దామని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని గొల్లపల్లి, పైడిపల్లి పోలింగ్ బూత్‌ల పరిధిలోని నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో వైసీపీ అరాచక పాలన కారణంగా ప్రజలు ఎదుర్కొన్న కష్టాల నుంచి విముక్తి కలగాలంటే భానుప్రకాష్‌ను అఖండ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అనంతరం బూత్ పరిధిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్ధేశం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు కూరగాయల మార్కెట్ వేలం

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 27: దినసరి కూరగాయల మార్కెట్, జంతువధశాల, ప్రైవేట్ బస్టాండ్‌లో గుత్త వసూలుకు బుధవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో వేలం పాట నిర్వహించనున్నట్లు కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్న కాంట్రాక్టర్లు పాల్గొనవచ్చన్నారు.

పుత్తూరు వార్తలు

లోక్ అదాలత్ వాయిదా

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 27: మార్చి 9వ తేదీన నిర్వహించాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ను వాయిదా వేస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి మార్చి 16వ తేదీన లోక్ అదాలత్‌ను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

శిలాఫలకాల తొలగింపు

వడమాలపేట, ఫిబ్రవరి 27: అనుమతి లేకుండా ప్రారంభించిన ప్రభుత్వ భవనాల శిల ఫలకాలను అధికారులు తొలగించి స్వాధీనం చేసుకున్నారు. అప్పలాయగుంటలో సచివాలయ భవనం, పట్టిపుత్తూరులో రైతు భరోసా కేంద్రం, అయ్యన్నగారిపల్లిలో పాల వెల్లువ నూతన భవనాలను జడ్పీటీసీ మురళీధర్ రెడ్డి ఆదివారం ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమాలకు అధికారులు గైర్హాజరయ్యారు. దీనిపై మల్లగుల్లాలు పడిన పంచాయతీ రాజ్ అధికారులు మంగళవారం పోలీసుల సమక్షంలో శిలా ఫలకాలను తొలగించి స్వాధీనం చేసుకున్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 27: తడుకులో ఎస్‌బీఐ, ఎంవీ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కళాజాత బృందం ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ వంశీధర్ పాపిరెడ్డి, సిబ్బంది వెంకటాద్రి, కళాజాత బృందం సభ్యులు వినోద్, చిరంజీవి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు అభివృద్ధి బాధ్యత నాది: భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 27: పుత్తూరు అభివృద్ధి బాధ్యతను తాను తీసుకుంటానని టీడీపీ నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ స్పష్టం చేశారు. మంగళవారం పట్టణంలోని ఐదవ వార్డు గణపతినగర్, తాయిమాంబాపురంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ, మీతో మీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు హయాంలో పుత్తూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రధానంగా విద్యా కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు మౌలిక సౌకర్యాల కల్పనకు ఇచ్చిన ప్రాధాన్యంతోనే పట్టణం అభివృద్ధి సాధించిందని వివరించారు. రెండు దఫాలు వైసీపీకి ఓటు వేయడం వల్ల ఎలాంటి అభివృద్ధి జరకపోవడంతో పాటు మట్టి, ఇసుక, గ్రావెల్, కంకర దోచుకుని వైసీపీ నాయకులు రూ.కోట్లకు పడగలెత్తారని ధ్వజమెత్తారు. శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని, ప్రైవేట్ సెటిల్‌మెంట్లు, గంజాయి, రౌడీయిజం, దౌర్జన్యాలు పెచ్చుమీరిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు స్టేషన్లు వైసీపీ నాయకులకు గెస్ట్‌హౌస్‌లుగా మారిపోయాయని, బాధితులపైనే కేసులు పెట్టడమనే దుస్థితి ఈ ఐదేళ్లలోనే చూస్తున్నామని మండిపడ్డారు. కరోనా కారణంగా అన్ని వర్గాలు ఉపాధి కోల్పోతే ఈ నియోజకవర్గంలో ఒక్క కుటుంబమే రూ.కోట్లు సంపాదించి ఆస్తులు కూడగట్టుకున్నారని ఆరోపించారు. మళ్లీ ప్రశాంత పుత్తూరు కావాలంటే టీడీపీకి మద్దతుగా ఉండాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. జగన్ చెప్పిన బూటకపు వాగ్దానాలను మరోసారి నమ్మి మోసపోవద్దని, సంక్షేమం, అభివృద్ధి కలగలిపి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతామని హామీ ఇచ్చారు. భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అరాచక వైసీపీ పాలనకు ముగింపు పలుకుతూ టీడీపీ, జనసేన ప్రభుత్వంకు మద్దతుగా సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాలి జీవరత్నంనాయుడు, ఎన్ఎన్ ధనపాల్, గంజి మాధవయ్య, చినబాబు, డీఎస్ గణేష్, షణ్ముగరెడ్డి, యుగంధర్, ఆనంద్, రిటైర్డ్ టీచర్ కుప్పయ్య, ఖాజాపీర్, విద్యాసాగర్, వార్డు అధ్యక్షుడు ఏలుమలైరెడ్డి, నాగరాజు, అయ్యప్పరెడ్డి, కుమార్, కేశవాచారి, ఏలుమలై, ఆనంగి చీరాల తదితరులు పాల్గొన్నారు.



భానుప్రకాష్‌తో సెల్ఫీ తీసుకుంటున్న మహిళలు

నారా లోకేశ్‌కు స్వాగతం

తమిళనాడులోని శ్రీపెరంబదూర్‌లో ఉన్న ఆదికేశవ పెరుమాళ్ ఆలయ సందర్శనకు వచ్చిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ మంగళవారం స్వాగతం పలికారు. ఆలయ ముఖద్వారం వద్ద దుశ్శాలువ, పూలబొకేతో నారా లోకేశ్‌ను సత్కరించారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన లోకేశ్‌కు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించారు.



అవార్డును అందుకుంటున్న రాజన్న ఫౌండేషన్ హెడ్ సతీష్

రాజన్న ఫౌండేషన్ విద్యా సంస్థలకు అవార్డు

రేణిగుంట,ఫిబ్రవరి27: అమరరాజా సంస్థలు, గల్లారామచంద్రనాయుడు కుటుంబసభ్యులు సంయుక్తంగా నిర్వహిస్తున్న రాజన్న ఫౌండేషన్ విద్యా సంస్థలకు బెస్ట్ ఎడ్యుకేషన్ సపోర్ట్ ఇనిషియేటివ్ ఆఫ్ ది ఇయర్-2024 అవార్డు లభించింది. దీనిని ఫౌండేషన్ హెడ్ సతీష్ అందుకున్నారు. డిల్లీలోని ఓ హోటల్లో మంగళవారం బ్రాండ్ హనాక్ వారి ద్వారా ఇండియన్ సోషల్ ఇంపాక్ట్ అవార్డ్స్ ప్రదానోత్సవం జరిగింది. ఈకార్యక్రమంలో తమ సంస్థకు అవార్డు రావడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని ఫౌండేషన్ ఛైర్మన్ గల్లా రామచంద్రనాయుడు చెప్పారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తమ ఫౌండేషన్ విద్యాసంస్థల సిబ్బందిని ఆయన అభినందించారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆలయ ఛైర్మన్, ఈవో

నాగలాపురం, ఫిబ్రవరి 27: మండల పరిధిలోని సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో జరుగనున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలపై పలు శాఖల అధికారులతో ఆలయ ధర్మకర్త మండలి సమావేశం నిర్వహించింది. మంగళవారం ఆలయ ట్రస్టు బోర్డు కార్యాలయంలో ధర్మకర్తల మండలి ఛైర్మన్ ఏ.వి.ఎం.బాలాజీరెడ్డి, ఈవో రామచంద్రారెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాగలాపురం ఎస్‌ఐ ఓబయ్య, విద్యుత్‌శాఖ ఏఈ జయసాయి, లైన్‌మాన్ రవి, వీఆర్వో చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ బాలాజీ రెడ్డి మాట్లాడుతూ మార్చి 29 నుంచి ఏప్రిల్ 10 వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పగడ్బందీగా నిర్వహించడానికి అన్నీ చర్యలు తీసుకున్నామన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సజావుగా స్వామి దర్శనం చేసుకునేందుకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. భక్తుల రద్దీ నియంత్రణకు అవసరమైన సిబ్బందిని కేటాయించాలని ఎస్‌ఐని కోరారు. అలాగే శ్రీసిటీ నుంచి ప్రత్యేక సెక్యూరిటీ సిబ్బంది కావాలని ఆ యాజమాన్యాన్ని కోరినట్లు తెలిపారు. ఇక క్యూలైన్ల వద్ద తాగునీరు, మజ్జిగ, మెడికల్ క్యాంపులు, తాత్కాలిక మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు కల్పిస్తూ ఆలయంలో ప్రత్యేక అర్చక బృందాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు విజయవంతంగా జరిగేలా ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు సీఐ దివాకర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు సురేష్, ఆనంద్, మునివేలు తదితరులు పాల్గొన్నారు.

పేదలపై ప్రతాపం అమానుషం: సీపీఎం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27: పేదలపై ప్రతాపం చూపుతూ పోలీసులు ఇల్లు కూల్చడం అమానుష చర్య అని సీపీఎం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల తీరును ఖండిస్తూ మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన ప్రదర్శించారు.. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి గంధం మణి మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి కరకంబాడిలోని 600 కుటుంబాలకు మూడేళ్ల క్రితం ఇంటి పట్టాలు మంజూరు చేసినా, ఇప్పటివరకు స్థలాన్ని చూపించలేదనీ, పేదలు ఎక్కడ నివసించాలని ప్రశ్నించారు. దీంతో పేదలు కరకంబాడిలోని ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుంటే అధికారులు వాటికి కూలదోయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పది రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పిన ఎమ్మెల్యే, పోలీసులకు గుడెసెలు కూల్చేయాలని ఆదేశించడం దుర్మార్గమని వాపోయారు. మరి రాజీవ్‌నగర్‌లో ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం అవుతుంటే వాటినెందుకు కూల్చేయలేదని నిలదీశారు. సీపీఎం నాయకులు గురవయ్య, కుమార్, వెలివేంద్రం, ఉస్మాన్ బాషా, రాజా, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా సామాజిక తనిఖీ

పిచ్చాటూరు, ఫిబ్రవరి 27: గత ఏడాదిగా మండలంలో జరిగిన ఉపాధి పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీ బహిరంగ సభ మంగళవారం మండల పరిషత్‌కార్యాలయ ఆవరణలో జరిగింది. ఉపాధిహామీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం గుట్టు చప్పుడు కాకుండా కనీసం ఉపాధి కూలీలకు కూడా సమాచారం ఇవ్వకుండా కానిచ్చేశారు. ఉపాధి పనుల నాణ్యత పరిశీలించి, ఏవైనా అవకతవకలు జరిగితే సమగ్ర విచారణ జరిపి, అవినీతి సొమ్మును రికవరీ చేయడం, అవినీతికి పాల్పడిన సిబ్బందిపై చర్యలకు సిఫార్సు చేయాల్సిన తనిఖీ అధికారులు అవి ఏమి పట్టనట్లు అధికార పార్టీ వారు చెప్పింది విని మమ అనిపించేశారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి కట్టు దిట్టమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అలరించిన పండరి భజన కోలాటాలు

పిచ్చాటూరు, ఫిబ్రవరి 27: మండల కేంద్రమైన పిచ్చాటూరు పట్టణంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల దేవాలయం ఆవరణలో మంగళవారం రాత్రి యువకులతో నిర్వహించిన పండరి భజన కోలాటాలు చూపరులను విశేషంగా ఆకర్షించింది.

బోరు మరమ్మతుకు సుధీర్ సహాయం

తొట్టంబేడు, ఫిబ్రవరి 27: మండలంలోని పెద్దకన్నలి ఎస్సీ కాలనీలో గత కొద్ది రోజులుగా తాగునీటి బోరు మరమ్మత్తులకు గురవడంతో కాలనీవాసులు తాగునీటికిఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా వారు స్పందించకపోవడంతో స్థానిక టీడీపీ నాయకులు శ్రీకాళహస్తి నియోజికవర్గ ఇంచార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి తన సొంత ఖర్చుతో తాగునీటి బోరుమోటరు మరమత్తు చేయించడంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తంచేశారు. టీడీపీ నాయకులు కన్నలి ప్రతాప్ రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకురాలి మృతికి సంతాపం

మండలంలోని చిట్టత్తూరు గ్రామంలో టీడీపీ నాయకురాలు సరస్వతి(రావమ్మ) మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న బొజ్జల బృందమ్మ వారి ఇంటికి వెళ్లి భౌతికాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యదర్శి గాలిచలపతినాయుడు, నాయకులు మునిరాజనాయుడు, బాలాజీరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27: రోడ్డు ప్రమాదంలో మరియప్ప(63) అనే వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. చెన్నై నగరం ఈరోడ్‌కు చెందిన మరియప్ప రోజువారి కూలీపని చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. లారీలో సరుకులు దించేందుకు మంగళవారం రాత్రి చెన్నై నుంచి తొట్టంబేడు మండలం రౌతు సూర మాల వద్ద ఉన్న ప్రైవేట్ పరిశ్రమ వద్దకు వచ్చాడు. పని ముగిసిన తర్వాత రాత్రి భోజనం చేసేందుకు పరిశ్రమ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని ద్విచక్ర వాహనం మరియప్పను ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన మరియప్పను స్థానికులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం చెవుల నుంచి రక్తస్రావం జరుగుతుండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు ఆరా తీస్తున్నారు.

శ్రీవారి సేవలో ఆర్టీసీ వైస్ చైర్మన్


గ్యారేజీలో సిబ్బందితో మిద్దెల హరి

తిరుమల, ఫిబ్రవరి 27 (ఆంధ్ర జ్యోతి): ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి, తిరుమల డిపో మేనేజర్ విశ్వనాథ్ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం తిరుమలలోని ఆర్టీసీ డిపో గ్యారేజ్‌ని పరిశీలించారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. మిద్దెల హరిని వక్ఫ్ బోర్డు చైర్మన్ సిరాజ్ బాషా సత్కరించారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

లోకేష్‌ని కలసిన హెలెన్, హేమలత



సత్యవేడు, ఫిబ్రవరి 27: చెన్నై శ్రీ పెరంబుదూరులోని రామానుజాలయ సందర్శనకు వచ్చిన నారా లోకేష్‌ను హెలెన్, హేమలత కలిసారు. చెన్నై ఎయిర్‌పోర్టులో సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి డా. హెలెన్, మాజీ ఎమ్మెల్యే హేమలత మర్యాదపూర్వకంగా కలిసారు. రాబోయే ఎన్నికల సమరానికి సిద్ధంగా ఉండాలని, కార్యకర్తలను సమన్వయపరుచుకుని, అధికార పక్షాన్ని ధీటుగా ఎదుర్కొనేందుకు ముందుకు వెళ్లాల్సిందిగా లోకేష్ సూచించారని హెలెన్ తెలిపారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు రండి


మహాశివరాత్రి ఆహ్వాన పత్రిక అందుకుంటున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27: ముక్కంటి ఆలయ మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను పలువురు ప్రముఖులకు అందజేశారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సోమవారం కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్, ఏఈవో ధనపాల్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు మంగళవారం తిరుపతిలో పలువురిని ఉత్సవాలకు ఆహ్వానించారు. ఇందులో భాగంగా తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి నగర మేయర్ శిరీష తదితరులను కలిసి శేష వస్త్రంతో సత్కరించి, ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముక్కంటి ఆలయ పాలక మండల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

16న జాతీయ లోక్ అదాలత్


మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27: వచ్చేనెల 16వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌ను పిర్యాదుదారులు, కక్ష దారులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ పిలుపునిచ్చారు. పట్టణంలోని న్యాయస్థాన భవనంలో మంగళవారం జాతీయ లోక్‌అదాలత్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ... సాధారణంగా 2వ శనివారం జాతీయ లోక్ అధాలత్ జరుగుతుందని, అయితే మార్చిలో 2వ వారం వరుస సెలవుల కారణంగా వచ్చేనెల 9వ తేదీన జరగాల్సిన లోక్‌అదాలత్ 3వ శనివారం 16వ తేదీకి వాయిదా వేసినట్లు వెల్లడించారు. అన్ని శాఖల అధికారులు పిర్యాదులు, కక్ష దారులకు 16వ తేదీన జరిగే లోకదాలత్ వాయిదాపై అవగాహన కల్పించాలని కోరారు. క్షేత్రస్థాయిలో దీనిపై విస్తృతంగా చైతన్యం తీసుకురావన్నారు.

గుడిసెల తొలగింపులో ఉద్రిక్తత

● భారీగా పోలీసుల మోహరింపు ● పేదలకు టీడీపీ సంఘీభావం ● ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు: ఆర్డీవో



కరకంబాడిలో గుడిసెలు తొలగిస్తున్న దృశ్యం - ఆ ప్రాంతంలో గుమిగూడిన సీపీఎం నేతలు, పేదలు

రేణిగుంట,ఫిబ్రవరి27: మండలంలోని కరకంబాడిలో గుడిసెల తొలగింపు ఉద్రిక్తతకు దారితీయగా, సీపీఎం ఆధ్వర్యంలో పేదలు తొలగింపును అడ్డుకున్నారు. మంగళవారం ఉదయం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. ప్రభుత్వభూముల్లో గుడిసెలు వేసుకుంటే సొంతింటి కల నిజమైతేందని ఆశతో పలు ప్రాంతాల ప్రజలు కరకంబాడి గుట్టపై తాత్కాలికంగా గుడిసెలు వేసుకున్నారు. మంగళవారం ఉదయం ఐదు గంటల నుంచి రెవెన్యూ సిబ్బంది గుడిసెలు తొలగించే కార్యక్రమం ప్రారంభించారు. దీంతో పేదలు బోరుమన్నారు.

రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ పరిధిలోని సర్వేనెంబరు 153-1లో పలు ప్రాంతాల ప్రజలు నెల రోజుల క్రితం తాత్కాలికంగా గుడిసెలు వేసుకున్న విషయం విదితమే. ఇళ్ళులేని పేదలకు ఇంటి స్థలాలు, మూడేళ్ళక్రితం జగనన్న ఇంటిపట్టాలు ఇచ్చినవారికి, ఇక్కడే ఇంటి స్థలాలు చూపాలని సీపీఎం నాయకులు ఆందోళనలు చేస్తున్నారు. అప్పటి నుంచి సోమవారం వరకు ప్రజాప్రతినిధులు,అధికారులు స్పందించపోగా, హఠాత్తుగా ప్రభుత్వ స్థలంలో వేసిన గుడిసెలను తొలగించేందుకు ఉపక్రమించారు.

జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు మంగళవారం తెల్లవారుజాము నుంచే పోలీసులు గుట్టదగ్గరకు చేరుకున్నారు. ఉదయం 5.30గంటల నుంచి రెవెన్యూ అధికారులు గుడిసెల తొలగింపు ప్రారంభించారు. ఈక్రమంలో సీపీఎం స్థానిక నాయకులు, ఇంటి స్థలాల సాధన పోరాట కమిటి నాయకులు రాజశేఖర్,మునిబాబు,అరుణ్,మస్తాన్ రాధిక పేదలతో కలసి అధికారులను అడ్డుకొనే ప్రయత్నంలో పేదలకు,పోలీసులకు మధ్య తోపులాటలు జరిగాయి. స్థానిక నాయకులను అదుపులోనికి తీసుకొనే సమయంలో జరిగిన పెనుగులాటలో కిందపడిన మహిళలకు స్వల్పంగా గాయాలయ్యాయి. రెవెన్యూ సిబ్బంది టాస్క్‌ఫోర్స్ పోలీసుల సహకారంతో గుడిసెలను తొలగించడంతో పేదలు గుడిసెలకు ఉపయోగించిన కర్రలను తీసుకొని వెళ్ళారు.

నాలుగు ఎక్స్‌కవేటర్లు,ఐదు ట్రాక్టర్లుతో రెవెన్యూ సిబ్బంది గుట్టపైకి చేరుకుని తాత్కాలిక గుడిసెలను తొలగించారు. గుడిసెలకు ఉపయోగించిన సామగ్రిని ట్రాక్టర్ల ద్వారా కిందకు తరలించి వ్యర్థాలను తగులబెట్టారు. మధ్యాహ్నం వరకు ఈకార్యక్రమం చేపట్టారు. కాగా సీపీఎం నాయకులు రేణిగుంట పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. తమ పార్టీ నాయకులను హౌస్ అరెస్టుతో పాటు అరెస్టు చేయడం అన్యాయమని మండల కార్యదర్శి హరనాథ్ ఖండించారు.

కాగా ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన బాధ్యత మేరకు చర్యలు తీసుకున్నామని ఆర్డీవో రవిశంకర్ రెడ్డి అన్నారు. ప్రైవేటు వ్యక్తులు ప్రవేశిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. రేణిగుంట మండలంలో అరుహలైన పేదలుంటే సచివాలాయాల్లో దరఖాస్తు చేసుకుంటే 90 రోజుల్లో జగనన్న ఇంటి పట్టాలిస్తామని ఆర్డీవో సూచించారు.

భారీగా మోహరించిన పోలీసులు

మంగళవారం తెల్లవారుజామునకే కరకంబాడి గుట్ట దగ్గరకు 78 మంది ఎస్టీఎఫ్ సిబ్బంది, వందమందికిపైగా పోలీసులు, పోలీసు అధికారులు చేరుకున్నారు. రెవెన్యూ అధికారులు,సిబ్బంది చేరుకొని తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యకరమంలో ఏఎస్పీ కులశేఖర్, డీఎస్పీలు భవ్యకిషోర్, సురేంద్రరెడ్డి, రవీంద్రరెడ్డి,నరసప్ప, పది మంది సీఐలు, పది మంది ఎస్‌ఐలు, తహసీల్దార్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటిస్థలాలివ్వండి: టీడీపీ

కరకంబాడి గుట్టపై తాత్కాలిక గుడిసెలు వేసుకున్న పేదలకు ప్రభుత్వం వెంటనే స్పందిచి ఇంటి స్థలాలను మంజూరు చేయాలని రేణిగుంట టీడీపీ నాయకులు టి.మునిచంద్రారెడ్డి, ఎం.బుజ్జినాయుడు,సి.సుబ్రమణ్యంరెడ్డి డిమాండ్ చేశారు.గుడిసెవాసులకు సంఘీబావం తెలిపారు.జగనన్న పట్టాలు ఇచ్చినవారికి వెంటనే స్థలాలు చూపాలి.ఇళ్ళు లేని పేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈ చర్య పేదలపాలిట కక్షసాధింపులా వుందని తాము భావిస్తున్నామన్నారు..సంఘీబావం తెలిపిన వారిలో నాయకులు మహబుబ్‌బాష, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి అసోం వాసి మృతి

శ్రీకాళహస్తి ఫిబ్రవరి 27: రైలు నుంచి జారిపడి ప్రబిన్ (40) అనే అసోంకు చెందిన వ్యక్తి మృతి చెందాడు. శ్రీకాళహస్తి జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ నరసింహులు కథనం మేరకు... అసోంకు చెందిన ప్రబిన్ రైలుల్లో నుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. తలకు బలమైన గాయంతో పట్టాల పైనుంచి లేచి ప్లాట్ ఫామ్ మీదకు చేరుకున్నాడు. అక్కడే కుప్పకూలి మృతి చెందాడు. రైల్వే పోలీసులు మృతుడి వివరాలు గుర్తించిన అనంతరం శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

పథకాలను చేరువ చేయడమే ధ్యేయం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27: అర్హులందరికీ పథకాలు చేరువ చేయడమే ధ్యేయంగా వికసిత్ భారత సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నామని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ పేర్కొన్నారు. శ్రీకాళహస్తి పట్టణ తెలుగు కాలనీలో మంగళవారం వికసిత భారత్ సంకల్పయాత్ర జరిగింది. కార్యక్రమంలో శ్రీకాళహస్తి అసెంబ్లీ కో కన్వీనర్ సుబ్రమణ్యం రెడ్డి, నాయకులు రమేష్ బాబు, గోపాల్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం విరాళం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27: తొట్టంబేడు మండలం పెద్దకనపర్తి గ్రామానికి చెందిన మాధవరావు అనేదాత ఒక ట్రక్కు పశుగ్రాసం విరాళంగా ముక్కంటి ఆలయానికి విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం భరద్వాజ తీర్థంలోని గోశాల వద్ద ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులకు అందజేశారు. ఆలయ అధికారులు దాతలు ఘనంగా సత్కరించారు.

మున్సిపల్ కమిషనర్‌గా రాంబాబు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27: శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా ప్రభుత్వం రాంబాబును నియమించింది. రాష్ట్ర రాష్ట్రవ్యాప్తంగా పలువురు అధికారులను బదిలీ చేస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ సెక్రటరీగా పని చేస్తున్న రాంబాబును శ్రీకాళహస్తి కమిషనర్‌గా బదిలీ చేశారు. అలాగే శ్రీకాళహస్తి పురపాలక సంఘం కమిషనర్‌గా పనిచేస్తున్న రమేష్ బాబు జంగారెడ్డిగూడెం కమిషనర్‌గా బదిలీ అయ్యారు.

దేశ రక్షణకు అందరం బాధ్యులమే



కేవీబీపురం ఫిబ్రవరి27: దేశ రక్షణకు అందరం బాధ్యులమేనని తిరుపతి ఆర్ అండ్ వీ రెజిమెంట్ కమాండింగ్ అధికారి ప్రకాశ్ కుమార్ చెప్పారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల అవరణలో తిరుపతి ఎన్‌సీసీ క్యాడెట్లు గుర్రపు స్వారీ చేసి విద్యార్థులకు అవగహన కల్పించారు.

నాలుగు రంగాలపై మోదీ దృష్టి: బీజేపీ

కేవీబీపురం ఫిబ్రవరి27: దేశాభివృద్ధి కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాలుగు రంగాలపైన దృష్టి పెట్టారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెనబాల చంద్రశేఖర్ చెప్పారు. మంగళవారం మండల కేంద్రంలోని మిద్దికండ్రిగ, ఆరే, రాయపేడు, కేవీబీపురం, రాజులకండ్రిగ, తిమ్మసముద్రం తదితర గ్రామాల్లో ప్రజాపోరు కార్యక్రమం నిర్వహించారు. ప్రజాపోరు జిల్లా కొ కన్వీనర్లు మునికృష్ణయ్య, మునిప్రతాప్, మునిశేఖర్, ఓబీసీ కన్వీనర్ సిద్దులయ్య, సభ్యులు వెంకటయ్య, పురుషోత్తం, హరిబాబురెడ్డి, సోని పాల్గొన్నారు.

కలెక్టర్‌కు, ఎస్పీకి ఫిర్యాదు చేసినా ఆగని ఇసుక రవాణా

● ట్రాక్టర్లను, ఎక్సకవేటర్లను అడ్డుకున్న గోవిందవరం గ్రామస్తులు ● పోలీసులకు వాహనాల అప్పగింత




స్వర్ణముఖి నదిలో ఇసుక తవ్వకాలు - ఇసుక తోడేయడంతో ఏర్పడిన భారీ గుంతలు - ఎక్సకవేటర్‌ను అడ్డుకున్న గోవిందవరం గ్రామస్తులు

ఏర్పేడు, ఫిబ్రవరి 27: మండలంలో నిరంతరాయంగా కొనసాగుతున్న ఇసుక అక్రమరవాణాను మంగళవారం గోవిందపురం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఏర్పేడు మండలంలో చెన్నంపల్లి వద్ద స్వర్ణముఖి నది ప్రారంభమై ముసలిపేడు వద్ద శ్రీకాళహస్తి మండలంలోకి ప్రవేశిస్తుంది. ఈ మధ్యలో చెన్నంపల్లి, గుడిమల్లం, పెనగడం, పాపానాయుడుపేట, వికృతమాల, గోవిందవరం, మునగలపాళెం, ఎండీపుత్తూరు, మడిబాక, కోబాక, కొత్తవీరాపురం,బండారుపల్లె, మన్నసముద్రం తదితర గ్రామాల మీదుగా నది వెళుతుంది. నది పరీవాహక ప్రాంతంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు ఇసుకను ఎక్సకవేటర్లతో తోడి ట్రాక్టర్ల ద్వారా తరలించేస్తున్నారు. నిత్యం ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తిరుపతి, రేణిగుంట తదితర ప్రాంతాలకు తరలించి సొమ్ముచేసుకుంటున్నారు. ప్రధానంగా మునగలపాళెం, గోవిందవరం గ్రామాల వద్ద స్వర్ణముఖి నది ప్రాంతంలో గత కొద్ది రోజులుగా ఎక్సకవేటర్ల సాయంలో వైసీపీ నేతలు స్వర్ణముఖి నది నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా గట్టుపైకి చేర్చి, అక్కడి నుంచి రాత్రి వేళ్లల్లో రోజుకు కనీసం 30 నుంచి 50 టిప్పర్ల ఇసుక చెన్నైకు తరలించేస్తున్నారు. ఒక్కో టిప్పర్ ఇసుక సుమారు రూ.60వేల నుంచి రూ.70వేలవరకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయంపై వారం రోజులుగా ఏర్పేడు రెవెన్యూ అధికారులు, పోలీసులకు గోవిందవరం గ్రామస్తులు సమాచారమిచ్చారు. అయినా వారి నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో సోమవారం స్పందన కార్యక్రమంలో తిరుపతి కలెక్టర్, ఎస్పీకి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని గోవిందవరం గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులకు ఫోన్‌చేసి గోవింవరం గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని ఆదేశించారు. ఆమె ఆదేశాలిచ్చి రెండు రోజులు కావస్తున్నా నేటికీ ఆ ప్రాంతంలో ఏర్పేడు పోలీసులు పర్యటించలేదు. ఈ ప్రాంతంలో చెరువులు లేకపోవడంతో కేవలం స్వర్ణముఖి నది నీటిపైనే రైతులు ఆధారపడి సాగుచేసుకునే పరిస్థితి. ఈ క్రమంలో గోవిందవరం గ్రామస్తులు పెద్ద ఎత్తున మంగళవారం ఇసుక అక్రమ రవాణాపై దండయాత్ర చేశారు. టీడీపీ సీనియర్ నాయకుడు పేరం చిరంజీవులనాయుడు ఆధ్వర్యంలో గోవిందవరం గ్రామస్తులు ట్రాక్టర్లలో తరలిస్తున్న ఇసుకను అడ్డుకుని, మూడు ట్రాక్టర్లతో పాటు, ఎక్సకవేటర్లను ఏర్పేడు పోలీసులకు అప్పగించారు.

ఇసుక ట్రాక్టర్లతో ముప్పు

అక్రమంగా ఇసుకను రాత్రింబవల్లు తరలిస్తున్న ట్రాక్టర్లతో ముప్పు పొంచిఉంది. 20 రోజుల క్రితం వికృతమాల నుంచి రేణిగుంటకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టరు డిక్సన్ పరిశ్రమ వద్ద ద్విచక్ర వాహనాన్నిఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. అదే విధంగా రెండు నెలల క్రితం కోబాక వద్ద ఇసుక ట్రాక్టరు ఏర్పేడు వైపు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో వాహనం నడుపుతున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ రకంగా అక్రమార్కులు రాత్రింబవళ్లు నియోజవర్గ స్థాయి వైసీపీ నేతల అండదండలతో ఇష్టారాజ్యంగా ఇసుకను తరలిస్తున్న క్రమంలో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏర్పేడు మండలంలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను జిల్లా స్థాయి అధికారులు అరికట్టకపోతే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

జాడలేని ఎస్ఈబీ,మైనింగ్ అధికారులు

వందల సంఖ్యలో రోజుకు ట్రాక్టర్ల ద్వారా అక్రమార్కులు ఇసుక తరలించి సొమ్ముచేసుకుంటున్నా ఏర్పేడు మండలంలో మాత్రం ఎస్ఈబీ అధికారులు కానీ, మైనింగ్ అధికారులు కానీ కనిపించడంలేదు. అంతే కాకుండా ఏడాది క్రితమే ఇసుకరీచ్‌కు అనుమతులు పూర్తయినప్పటికీ దీనిపై ఎవరూ చర్యలు తీసుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. . మండలంలో విచ్చలవిడిగా సాగుతున్న ఇసుక అక్రమ రవాణాను అరికట్టడానికి సంబంధిత శాఖల అధికారులు దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.